JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి I గురువారం 02-07-2026

Medchal - Malkajgiri I Thursday 02-07-2026

Follow: jayabherinews

సంపుటి : 03 I సంచిక : 31

పేజీలు : 8 I వెల : 5

Vol. 03 I Issue 31 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com



## ఆదాయ సమీకరణలో చేజింగ్ సెల్ ఏర్పాటు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై సీఎం రేవంత్ సమీక్ష

జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్ర బడ్జెట్ కు అనుగుణంగా లక్ష్యాలను సాధించడానికి ఆదాయ సమీకరణపై కచ్చితంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లీకేజీలను అరికట్టి ఆదాయ సమీకరణకు సంబంధించి చేజింగ్ సెల్స్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ సమీకరణపై ముఖ్యమంత్రిరు ఎంసీఆర్ హెచ్ఆర్డీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , జూపల్లి కృష్ణారావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు కె రామ కృష్ణారావు , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదాయ పెంపు విషయంలో ముఖ్యమంత్రి అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. హెచ్ఎండీఏ, టీజీఐఐసీ ఆదాయ సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, మైనింగ్తో పాటు ఇతర శాఖలకు సంబంధించి లీకేజీలను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు.

ఆదాయ సమీకరణలో చేజింగ్ సెల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం వీడాల్సిందేనని అధికారులకు స్పష్టం చేశారు. అనుకున్న స్థాయిలో పనిచేయాలంటే శాఖలవారీగా సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా శాఖలవారిగా బడ్జెట్లు తయారు చేసుకోవాలని చెప్పారు. ప్రాజెక్టులకు సంబంధించి ప్రధానంగా భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిపాదించే బడ్జెట్ ఊహాజనితం కాదన్న విషయం గుర్తుపెట్టుకోవాలని, వాస్తవికత ఆధారంగానే బడ్జెట్ రూపకల్పన జరగాలని స్పష్టం చేశారు. ఆయా శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

ఆదాయ సమీకరణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించాను. HMDA, TGIIC, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్, మైనింగ్ తో పాటు ఇతర శాఖలకు సంబంధించి లీకేజీలు లేకుండా జాగ్రత తీసుకోవాలని సూచించాను. చేజింగ్ సెల్ నేర్పాటు చేసుకుని నిరంతరం ఫాలో అప్ చేయాలని చెప్పాను. శాఖలవారీగా డిపార్ట్ మెంట్స్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సూచించాను. భూసేకరణను మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని స్పష్టం చేశాను.వివిధ శాఖలకు అవసరమైన అన్ని రకాల సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశాను.ఆదాయం పెంపు, నిధుల సమీకరణ విషయంలో నిర్లక్ష్యం సహించేది లేదని స్పష్టం చేశాను.

--ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## భారత్ లో విలీనం కోరుతూ.. పీఓకేలో ప్రజా ఉద్యమం




"పాక్ ఆక్రమిత జమ్మూ అండ్ కశ్మీర్, గిల్గిత్-బాల్టిస్తాన్‌లలో పాకిస్తాన్ ప్రభుత్వ అణచివేత, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు ఉవ్వెత్తున ఉద్యమిస్తున్నారు. "మాకు పాకిస్తాన్ వద్దు.. చట్టబద్ధమైన భారతదేశంలోనే కలిసిపోతాం" అనే నినాదాలు క్షేత్రస్థాయిలో బలంగా వినబడుతున్నాయి. ఒకవేళ అక్కడి ప్రజలు పూర్తిస్థాయిలో తిరుగుబాటు చేసి భారత్‌లో కలుస్తామని అధికారికంగా కోరితే.. భారత ప్రభుత్వం వారిని నేరుగా కలుపుకోగలదా? దీనికి అంతర్జాతీయ చట్టాలు, ఐక్యరాజ్యసమి నిబంధనలు అంగీకరిస్తాయా? అంతర్జాతీయ చట్టాల పరంగా చూస్తే.. 1947 అక్టోబర్ 26న జమ్మూ కశ్మీర్ పాలకుడు మహారాజా హరిసింగ్ భారతదేశంతో కుదుర్చుకున్న విలీన ఒప్పందం పై సంతకం చేశారు.

- పాకిస్తాన్ ఆధీనంలో ఉన్న ప్రాంతం అంతర్జాతీయ చట్టాల ప్రకారం అక్రమ ఆక్రమణ కిందకే వస్తుంది
- 1994లో పార్లమెంట్ ఏకగ్రీవంగా PoJKని తిరిగి స్వాధీనం చేసుకోవడమే ఏకైక ఎజెండా

జయభేరి, శ్రీనగర్, జూలై 1 :

బ్రిటీష్ ఇండియా చట్టాల ప్రకారం ఈ ఒప్పందం 100% చట్టబద్ధమైనది. దీని ప్రకారం యావత్ జమ్మూ కశ్మీర్ రాష్ట్రం భారతదేశంలో విలీనమైంది. కాబట్టి, పాకిస్తాన్ ఆధీనంలో ఉన్న ప్రాంతం అంతర్జాతీయ చట్టాల ప్రకారం అక్రమ ఆక్రమణ కిందకే వస్తుంది. భారత రాజ్యాంగం ప్రకారం కూడా PoJK భారతదేశంలో అంతర్భాగమే. ఆ ప్రాంతం కోసం ప్రత్యేకంగా 24 అసెంబ్లీ స్థానాలను ఖాళీగా ఉంచడం, 1994లో పార్లమెంట్ ఏకగ్రీవంగా PoJKని తిరిగి స్వాధీనం చేసుకోవడమే ఏకైక ఎజెండా అని తీర్మానించడం దీనికి బలమైన సాక్ష్యాలు.



## స్వర్ణాంధ్ర 2047 దిశగా చంద్రబాబు అడుగులు

- ఇన్నోవేషన్, మ్యానుఫ్యాక్చరింగ్, టెక్నాలజీ గమ్యస్థానంగా ఏపీ!
- లక్షలాది మంది భారతీయ యువతకు స్ఫూర్తి రాష్ట్రపతి ముర్ము జీవితం
- సౌకర్యవంతమైన మార్గాన్ని ఎంచుకునే వారికి విజయం దక్కదు
- ఉద్యోగార్థులుగా కాదు... ఉద్యోగాల సృష్టికర్తలుగా యువత ఎదగాలి
- అనంతపురం సెంట్రల్ యూనివర్సిటీ తొలి కాన్వకేషన్ లో మంత్రి లోకేష్

జయభేరి, అనంతపురం:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీజీ దూరదృష్టి గల నాయకత్వంలో భారతదేశ జాతీయ విద్యా విధానం, డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, వికసిత్ భారత్ 2047 దార్శనికత ద్వారా విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తున్నారు. ఈ స్ఫూర్తితో మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'స్వర్ణాంధ్ర 2047' దిశగా అడుగులు వేస్తున్నారు. తద్వారా విద్య, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలను సృష్టించగల, భవిష్యత్తుకు సంసిద్ధమైన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురంలోని ఏపీ సెంట్రల్ యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఈరోజు యువ పట్టభద్రులతో నిండిన ఈ సభను చూస్తున్నప్పుడు... నాకు కేవలం పట్టాలు స్వీకరిస్తున్న విద్యార్థులు మాత్రమే కనిపించడం లేదు. భవిష్యత్తును తీర్చిదిద్దడానికి సిద్ధంగా ఉన్న ఒక తరం కనిపిస్తోంది. ప్రతి తరానికీ ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. భవిష్యత్తును నిర్మించే అవకాశం ఈ తరానికి లభించింది. ఇది మీ సమయం, ఇది మీకు లభించిన గొప్ప అవకాశం. మీ నేపథ్యం మీ భవిష్యత్తును నిర్ణయించేలా ఎప్పుడూ అనుమతించకండి. మీ కలలు, మీ కఠోర శ్రమ, మీ వ్యక్తిత్వం... ఇవే మీరు ఎవరన్నదానిని నిర్వచించేలా చూసుకోండని అన్నారు.

...మిగతాది 2 లో

## రాష్ట్రంలో ఎప్పుడైనా.. ఎక్కడైనా.. చర్చకు తాను సిద్ధమని సవాల్

- దమ్ముంటే బాకీ తీర్చిన తరువాత ఉత్సవాలు చేయండి
- ఢిల్లీలో ఇజ్జత్ లేకపోతే ఎందుకు పోతున్నవ్..
- నువ్వు నడుపుతున్న రాష్ట్రాన్ని నువ్వే తిట్టడం ఏం దరిద్రం
- అట్టర్ ఫ్లాప్ సినిమాకి అర్ధశత దినోత్సవం చేయడమంటే ఇదే.. రైతు ఆశీర్వాద సభలపై కేటీఆర్



జయభేరి, హైదరాబాద్, జూలై 1 :

తెలంగాణ రాష్ట్రం దివాలా తీసిందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పరిపాలన వైఫల్యాలు, రైతన్నల దుస్థితి, వ్యవసాయ సంక్షోభం, ప్రభుత్వ వైఫల్యాలపై రాష్ట్రంలో ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి స్వయంగా సమయం, స్థలం నిర్ణయించి చెబితే చర్చకు వస్తానని అన్నారు. నిజంగానే రేవంత్ రెడ్డికి దమ్ముంటే తన సవాల్‌ను స్వీకరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరూపించడంలో తాను విఫలమైతే అక్కడికక్కడే రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటానని కేటీఆర్ ప్రకటించారు. సిఎం, అయన కుటుంబం, మంత్రులు,

...మిగతాది 2 లో



## రేషన్ పంపిణీ షురూ..

- లబ్ధిదారులకు శుభవార్త..
- అలా చేసేవారిపై చర్యలు.. వార్నింగ్!

జయభేరి, హైదరాబాద్, జూలై 1 :

రేషన్ కార్డు లబ్ధిదారులకు శుభవార్త. ఈ నెలలో మీ రేషన్ సరఫరా ప్రారంభం అవుతుంది. పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలకు రేషన్ సరఫరా జరుగుతుంది. మొత్తం 2.15 లక్షల టన్నుల


...మిగతాది 2 లో

## 10 కిలోల డ్రై గంజాయి స్వాధీనం



జయభేరి, శేరిలింగంపల్లి :

లింగంపల్లి రైల్వే స్టేషన్ దగ్గర డ్రై గంజాయి విక్రయాలు పెడ్లర్ అరెస్ట్.. 10 కిలోల డ్రై గంజాయి స్వాధీనం ప్రధాన సరఫరాదారు పరారీ. శేరిలింగంపల్లి SOT, చందానగర్ పోలీసుల సంయుక్త ఆపరేషన్ నిందితుడి వద్ద నుంచి 10 కిలోల డ్రై గంజాయి స్వాధీనం. నిందితుడు ఒడిశా రాష్ట్రం బౌధ్ జిల్లా మకుంద్‌పూర్ గ్రామానికి చెందిన సుబ్నాథ్ నుంచి డ్రై గంజాయిని కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడి. ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడింపు బౌధ్ జిల్లా మనముండా పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన కపాసిరా ప్రభాష్ నాగ్ అలియాస్ శక్తి (19) మరో నిందితుడిగా గుర్తింపు.. కేసు నమోదు చేసి, ప్రధాన సరఫరాదారుతో పాటు ఇతర నిందితుల కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు.




## ఓఆర్ఆర్ వద్ద పోలీసుల కాల్పులు

- పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో నిందితుడు వారిపై ఎదురుదాడి
- పోలీసుల పై కత్తితో దాడికి యత్నం.. ఆత్మరక్షణ కోసం పోలీసుల కాల్పులు

జయభేరి, హైదరాబాద్, జూలై 1 :

హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో మంగళవారం కాల్పులు కలకలం రేపాయి. నల్గొండ జిల్లా కేంద్రంతో పాటు పలు ఇతర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఒక నిందితుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు నల్గొండ సీసీఎస్ పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసుల బృందం అతడిని పట్టుకునేందుకు మంగళవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఆదిభట్ల పరిసరాల్లోని హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిందితుడిని పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించారు. అయితే, పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో నిందితుడు వారిపై ఎదురుదాడికి దిగాడు. ఈ క్రమంలోనే పోలీసులు ఆత్మరక్షణ కోసం అతడిపై కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ కాల్పుల్లో గాయపడిన నిందితుడిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భూష్మి శ్రీకాంత్‌గా పోలీసులు గుర్తించారు.



▶▶ మొదటిపేజీ తరువాయి

## పీఓకేలో ప్రజా ఉద్యమం

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 47 ప్రకారం.. కశ్మీర్ సరిహద్దుల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరగాలి. అయితే, దీనికి మొదటి నిబంధన ఏంటంటే.. పాకిస్తాన్ కశ్మీర్ భూభాగం నుండి తన సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలి. కానీ, పాక్ గత ఏడు దశాబ్దాలుగా ఆ పని చేయలేదు సరికదా, అక్కడ జనాభా సమతుల్యతను దెబ్బతీస్తూ పాకిస్తానీయులను తెచ్చి స్థిరపరిచింది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం.. ఒక దేశంలో అంతర్గతంగా అణచివేతకు గురవుతున్న ప్రజలు స్వయం నిర్ణయాధికారం కింద వేరే దేశంలో విలీనం కోరవచ్చు. గతంలో బంగ్లాదేశ్, క్రిమియా ఉదంతాల తరహాలో కాబట్టి PoJK ప్రజలు స్వచ్ఛందంగా తిరుగుబాటు చేస్తే, వారికి మద్దతుగా నిలిచే నైతిక, చట్టపరమైన హక్కు భారత్‌కు ఉంటుంది. PoJK లోని అందరు పౌరుల ఆలోచనలు ఒకేలా లేవు. అక్కడ మూడు రకాల వాదనలు ఉన్నాయి. మొదటి వర్గం.. పాక్ నరకం కంటే భారత్ వైపు ఉన్న జమ్మూ కశ్మీర్ సాధిస్తున్న అద్భుతమైన ఆర్థిక ప్రగతిని, శాంతిభద్రతలను చూసి భారత్‌లో విలీనమవ్వాలని గట్టిగా కోరుకుంటున్నారు. రెండవ వర్గం.. పాకిస్తాన్, భారత్ రెండింటికీ దూరంగా స్వతంత్ర కశ్మీర్ కావాలని ఆశిస్తున్నారు. మూడవ వర్గం.. ఇస్లామాబాద్ ప్రభుత్వం పెంచి పోషించిన తీవ్రవాద సానుభూతిపరులు. అయితే, ప్రస్తుతం పాక్‌లో ఉన్న ఆర్థిక దారిద్ర్యం, గోధుమ పిండి కోసం కొట్టుకునే పరిస్థితుల వల్ల.. స్వతంత్రంగా బతకడం సాధ్యం కాదని గ్రహించిన మెజారిటీ ప్రజలు, మేధావులు, భారత్ వైపు మొగ్గు చూపడమే సురక్షితమైన మార్గమని భావిస్తున్నారు. భారత ప్రభుత్వం ప్రస్తుతానికి సైనిక చర్య ద్వారా PoJKని ఆక్రమించుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదు. రక్షణ నిపుణుల విశ్లేషణ ప్రకారం.. మోదీ ప్రభుత్వం సాఫ్ట్ పవర్ & దౌత్య వ్యూహం అమలు చేస్తోంది. పాకిస్తాన్ ఆర్థికంగా పూర్తిగా పతనమై, బలూచిస్తాన్, కేపికే ప్రాంతాల్లో అంతర్గత యుద్ధాలతో ముక్కలయ్యే స్థితికి చేరుకుంది. ఇలాంటి తరుణంలో గిల్గిత్, ముజఫరాబాద్ ప్రజల తిరుగుబాటు తీవ్రరూపం దాల్చి, వారు సరిహద్దులు దాటి భారత్ వైపు రావడం ప్రారంభిస్తే.. మానవతా దృక్పథంతో భారత్ ఆ భూభాగాన్ని తన ఆధీనంలోకి తీసుకునే వ్యూహాన్ని అమలు చేస్తోంది. అంతర్జాతీయంగా చైనా అడ్డుపడే అవకాశం ఉన్నప్పటికీ, లీగల్ అథారిటీ భారత్ వైపే ఉండటం వల్ల ప్రపంచ దేశాలను ఒప్పించడం న్యూఢిల్లీకి పెద్ద కష్టమేమీ కాదు.

## చర్చకు తాను సిద్ధమని సవాల్

కాంగ్రెస్ నేతల దోపిడి వల్లనే తెలంగాణ దివాళ తీస్తున్నదన్నారు. కెటిఅర్ ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి భావ దారిద్ర్యంతో మాట్లాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రం పైన విషం చిమ్ముతున్నాడు. ఎంత దివాలాకోరు మనిషి అయినా, నేను దివాలా తీశాను అని చెప్పి, మెడలో బోర్డు వేసుకొని తిరగడు. కానీ రేవంత్ రెడ్డి ప్రతిసారి తెలంగాణ గురించి మాట్లాడుతూనే ఉన్నారు. ఒకసారి దివాలా అంటాడు, మరోసారి ఎయిడ్స్ రోగి అంటాడు, మరోసారి క్యాన్సర్ పేషెంట్ అంటాడు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రం గురించి ఇంత నీచంగా మాట్లాడే ముఖ్యమంత్రి దేశంలో ఎవరూ లేరు. ఢిల్లీకి పోతే ఇజ్జత్ లేదు అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి, మరి 72 సార్లు ఎందుకు ఢిల్లీకి వెళ్ళాడో చెప్పాలి. 30 నెలల్లో 72 సార్లు ఢిల్లీకి వెళ్లి ఎవరిని బతిమాలుకోవడానికి వెళ్తున్నారో ప్రజలకు చెప్పాలి. నిజంగానే రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే, రెండున్నర సంవత్సరాల పాటు ఇక ఢిల్లీకి వెళ్లకుండా తెలంగాణలోనే ఉండి పరిపాలన చేసి తన నిబద్ధత చాటుకోవాలి. రేవంత్ రెడ్డి చెప్తున్నట్లు తెలంగాణ దివాలా తీసిన రాష్ట్రం ఏమాత్రం కాదు. ఒకనాడు దశరథి అన్నట్లు నా తెలంగాణ కోటి రత్నాల వీణ అయితే, మా కె.సి.ఆర్ సారధ్యంలో తెలంగాణ కోటి ఎకరాల మాగాణ అయ్యింది. పంటలు, ఆదాయం, సాగునీరు అన్నీ రెట్టింపుకు మించి అభివృద్ధి సాధించింది. అయినా ఇంతటి ధనిక రాష్ట్రాన్ని పట్టుకొని రేవంత్ రెడ్డి ఎందుకు అడ్డగోలుగా మాట్లాడుతున్నారో తెలియదు. తెలంగాణ వ్యక్తిని చూసి కాదు, రేవంత్ రెడ్డిని చూసి అసహ్యంచుకుంటున్నారు. రేవంత్ రెడ్డి ఒక దొంగ కాబట్టే, రేవంత్ రెడ్డిని చూడగానే ఒక దొంగ వచ్చాడు అని అనుకోవడంలో తప్పు లేదు. కేంద్రం సహకరించకున్నా అద్భుతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకుపోయాము. ఇతర రాష్ట్రాల మాదిరి తెలంగాణకు ఒక్క ప్రాజెక్టు ఇవ్వకున్నా, ఒక్క రూపాయి అదనంగా ఇవ్వకున్నా అద్భుతమైన ప్రగతి పథంలో తీసుకుపోయాము.

కేవలం కే.సి.ఆర్ కి తెలంగాణ అనేది నా సొంత రాష్ట్రం, సాధించి పోరాడి తెచ్చుకున్న రాష్ట్రం అన్న నిబద్ధతతో పని చేసినాడు, కాబట్టే ఇంత అద్భుతంగా తెలంగాణ అభివృద్ధి చెందింది. ఎంతసేపు అప్పుల పేరుతో రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నాడు. కానీ బి.జె.పి ఎం.పి రఘునందన్ రావు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలంగాణ అప్పులు కేవలం రెండు లక్షల డెబ్బై వేల కోట్లు మాత్రమే అని స్పష్టంగా కేంద్ర ప్రభుత్వం చెప్పింది. ఆయన అయినప్పటికీ రేవంత్ రెడ్డి మాత్రం ఆరు లక్షలు, ఏడు లక్షలు, ఎనిమిది లక్షలు అంటూ రోజుకొక మాట అప్పుల గురించి మాట్లాడుతున్నారు. కేవలం అప్పులే కాదు, రాష్ట్ర ఆదాయంతో పాటు అప్పులకు కడుతున్న మిత్తి లెక్కల పైన కూడా తప్పుడు మాటలు మాట్లాడుతూ, తెలంగాణను ఏదో దివాలా తీసిన రాష్ట్రంగా చూపించే నీచమైన ప్రయత్నం చేస్తున్నాడు. ఒకవేళ రేవంత్ రెడ్డి అంటున్నట్టు తెలంగాణ దివాలా తీయాల్సి వస్తే, కచ్చితంగా అది ఆయన కుటుంబ సభ్యులు, సోదరులు తన మంత్రివర్గ సహచరులు చేస్తున్న అవినీతి, దోపిడి వల్లనే, లూటీ వల్లనే తెలంగాణ దివాలా తీస్తున్నది అన్నారు. అన్ని తప్పుడు లెక్కలు దొంగ మాటలు చెప్పి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని వర్గాలకు అన్యాయం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం ఒక్క రాష్ట్ర రైతాంగానికే లక్ష 13 వేల కోట్ల రూపాయల కోట్లు ఎగగొట్టారు. రైతు బంధు ఇవ్వకుండా, సంపూర్ణ రుణ హామీ, రుణమాఫీ చేయకుండా, కౌలు రైతులకు, రైతు కూలీలకు ఇస్తామని చెప్పిన ఆర్థిక సహాయం చేయకుండా పూర్తిగా లక్షా 13 వేల కోట్ల రూపాయల రైతులకు ఎగగొట్టి, ఈరోజు సిగ్గులేకుండా రాష్ట్రంలోని రైతాంగం గురించి వారేదో సంతోషంలో ఉన్నారు అని చెప్పుకుంటూ, రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని కే.టి.ఆర్ అన్నారు.

## రేషన్ పంపిణీ షురూ..

సన్న బియ్యం పంపిణీ చేయనున్నారు. ఈ పథకం ద్వారా సుమారు 3.41 కోట్ల మంది పేదలు, సామాన్యులు ప్రత్యక్ష లాభం పొందనున్నారు. రేషన్ షాపులకు బఫర్ స్టాక్ ప్రభుత్వం ఆహార భద్రతను బలోపేతం చేయడం కోసం ముందస్తు ప్రణాళికలు చేసింది. గతంలో యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్ల వల్ల గోదాముల్లో నిల్వ సమస్య ఎదుర్కొన్న నేపథ్యంలో, ఏప్రిల్, మే, జూన్ నెలల కోటాను ముందుగానే పంపిణీ చేసి గోదాముల ఒత్తిడి తగ్గించింది. దీంతో జులై నెలకు అవసరమైన బఫర్ స్టాక్ ఇప్పటికే అన్ని రేషన్ షాపులకు చేర్చడం పూర్తయింది.

**రేషన్ లబ్ధిదారులకు అలెర్ట్**

లబ్ధిదారులు ఎలాంటి ఆలస్యం లేకుండా, మొదటి రోజు నుంచే తమ కేటాయింపు బియ్యాన్ని సులభంగా తీసుకోవచ్చు. పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఈ వ్యవస్థలో పారదర్శకత, నాణ్యతను కాపాడటం కోసం కఠిన మార్గదర్శకాలు జారీ చేశారు. రేషన్ పంపిణీలో ఎలాంటి అక్రమాలు జరగకుండా ఈపాస్ బయోమెట్రిక్ వ్యవస్థ, డిజిటల్ తూకాల యంత్రాలను తప్పనిసరిగా ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు.

**బియ్యం అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ లపై కఠిన చర్యలు**

క్షేత్ర స్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని, డిజిటల్ బరువు తూకాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. ఒక్క గ్రాము కూడా తక్కువ ఇవ్వకుండా, నాణ్యమైన బియ్యం మాత్రమే లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. బియ్యం అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ లాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని పేదలు, కార్మిక వర్గాలు ఆర్థిక భారం నుంచి కొంతవరకు ఉపశమనం పొందుతారు.

**ఆధార్ లింక్ తో రేషన్**

ప్రభుత్వం కేంద్రం నుంచి కేటాయించిన కోటాలో గతంలో 95 శాతం పంపిణీ చేసి రికార్డు సాధించింది. ఇలాంటి చర్యలు ఆహార సరఫరా వ్యవస్థను మరింత బలంగా చేస్తాయి. లబ్ధిదారులు తమ రేషన్ కార్డులు, ఆధార్ లింక్‌తో షాపులకు వెళ్లి సరైన విధంగా బియ్యం తీసుకోవాలి. ఎక్కడైనా రేషన్ బియ్యం పక్కదారి పట్టిన సంఘటనలు గమనించిన వారు సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్తున్నారు.




- **అమరావతి వర్సెస్ మావిగన్**
- **బాబుది 'రెడ్ బుక్' అరాచక రాజ్యాంగం**

**జయభేరి, విజయవాడ, జూలై 1 :**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం నిర్వహించిన ప్రెస్ మీట్ లో సరికొత్త అజెండాను ప్రకటించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన ఏపీ రాజధానిగా చంద్రబాబు ప్రతిపాదిస్తున్న అమరావతిని మరోసారి తిరస్కరించారు. తాము తెచ్చి మావిగన్ కారిడార్ అభివృద్ధి ప్రతిపాదనకే తమ పార్టీ సంపూర్ణంగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల సమరం ప్రధానంగా మావిగన్ వర్సెస్ అమరావతి మధ్యే ఉంటుందని, ఈ రెండు రాజధాని నమూనాలలో ప్రజల మద్దతు దేనికి ఉందో వచ్చే ఎన్నికల్లోనే తేలిపోతుందని జగన్ సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ మావిగన్ కారిడార్ ప్రతిపాదనను అధికారికంగా చేరుస్తామని ఆయన వెల్లడించారు. 'జగన్ అమరావతికి వ్యతిరేకం' అంటూ కొందరు కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని వైఎస్ జగన్ మండిపడ్డారు. తాను అమరావతి ప్రాంతానికి గానీ, అక్కడి రైతులకు గానీ వ్యతిరేకం కాదని క్లారిటీ ఇచ్చారు. అమరావతి పేరుతో సీఎం చంద్రబాబు నాయుడు సాగిస్తున్న వేల కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ స్కామ్‌లను, అవినీతిని మాత్రమే తాను ప్రశ్నిస్తున్నానని చెప్పారు. శూన్యం నుండి అమరావతిని నిర్మించడానికి లక్షల కోట్లు ఖర్చు చేయడం రాష్ట్ర భవిష్యత్తును భ్రమల్లో నెట్టడమేనని విమర్శించారు. దానికి బదులుగా.. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్, పోర్టు, జాతీయ రహదారుల వంటి మౌలిక సదుపాయాలు ఉన్న 110 కిలోమీటర్ల 'మావిగన్' ప్రాంతాన్ని రాజధాని కారిడార్‌గా మార్చడమే అత్యంత ఆచరణాత్మకమైన పరిష్కారమని, అవినీతి లేని రాజధాని కావాలనేదే తన ఆకాంక్ష అని జగన్ వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై వైఎస్ జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం 'SIR' పేరుతో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల ఓట్లను వ్యవస్థాగతంగా తొలగించే పెద్ద కుట్ర చేస్తోందన్నారు. ఓట్లను తొలగిస్తే భవిష్యత్తులో ప్రజలకు సంక్షేమ పథకాలు ఎలా వస్తాయి? అసలు ఓట్లు తీసేసి చివరికి ఈ రాష్ట్రంలో పౌరులకు సిటిజన్‌షిప్ కూడా లేకుండా చేస్తారా?" అని జగన్ నిలదీశారు. క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇవ్వకుండానే, ఇచ్చినట్లు రాయాలంటూ చంద్రబాబు అధికారులను ఆదేశిస్తున్నారని, ప్రతి పోలింగ్ బూత్‌లో 40 నుండి 50 వైసీపీ ఓట్లను తొలగించాలని చూస్తున్నారని, దీనిపై తమ క్యాడర్ గట్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ఆర్థిక, వ్యవసాయ పరిస్థితులపై జగన్ ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో ఏ పంటకూ కనీస గిట్టుబాటు ధర లేదని విమర్శించారు. అసెంబ్లీలో మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ధరల స్థిరీకరణ నిధికి అరకొర నిధులే కేటాయించారని ఎద్దేవా చేశారు. "రైతులు పంట పండిస్తే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్న గ్యారంటీ కూడా లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో పొగాకు రైతులు రోడ్డెక్కుతున్నారు, ఆక్వా రైతులు మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మా హయాంలో తెచ్చిన 'అప్సడా' చట్టాన్ని పక్కనబెట్టి ఫీడ్ సిండికేట్లకు బాబు కొమ్ముకాస్తున్నారు" అని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారుతమ ఐదేళ్ల హయాంలో రాష్ట్రంలో నిరంతరం విద్యా, వైద్యం, ఆర్బీకేలు , పేదల సంక్షేమం గురించి చర్చ జరిగేదని.. కానీ చంద్రబాబు సీఎంగా వచ్చాక రాష్ట్రంలో కేవలం రెడ్ బుక్ రాజ్యాంగం , కస్టోడియల్ డెత్స్ మీదనే చర్చ జరుగుతోందని జగన్ దుయ్యబట్టారు. విజయవాడ పరిధిలో జరిగిన సాయికృష్ణ, క్రాంతికుమార్ మరణాల కేసుల్లో నిజాలను కప్పిపుచ్చడానికి కృష్ణలంక పీఎస్ సీసీటీవీ ఫుటేజీలను డిలీట్ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా పూర్తిగా పక్కకుపోయి, 'రూల్ ఆఫ్ ఫియర్' రాజ్యమేలుతోందని, సాధారణ ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు వచ్చాయని జగన్ ఘాటుగా విమర్శించారు. చంద్రబాబు చేస్తున్న టాపిక్ డైవర్షన్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. వీకెండ్ వచ్చింది అంటే చాలా ఎక్కడ టూర్ ప్లాన్ చేద్దామనే ఆలోచన చాలా మందిలో ఉంటుంది. ఇందులో ఎక్కువ మంది బీచ్‌ను ప్రిఫర్ చేస్తారు. అందుకే టూర్ ప్లాన్ వచ్చింది అంటే చాలా మొదట గుర్తుకు వచ్చేది గోవానే. అలాంటి పరిస్థితి లేకుండా మన దగ్గర కూడా అలాంటి ఫెసిలిటీస్‌తో బీచ్‌వ్యూ ఎంజాయ్ చేస్తూ చిల్ అవ్వొచ్చని ప్రభుత్వం చెబుతోంది. అందుకే తీరంలో బీచ్ షాక్స్ పేరుతో సరికొత్త టూరిజం డెస్టినేషన్ ఏర్పాటు చేస్తున్నారు. టూరిజం పాలసీని తీసుకొస్తూ ఏపీ బీచ్‌లలో తాత్కాలిక షాక్స్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

దీనిపై పొలిటికల్ సర్కిల్స్‌లో మాత్రం తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. వైజాగ్ సంస్కృతి నాశనం చేస్తున్నారని జగన్ లాంటి వారంతా దుమ్మెత్తి పోస్తున్నారు. సింపుల్‌గా చెప్పాలంటే బీచ్ షాక్స్ అంటే సముద్ర తీరంలో పర్యాటకుల కోసం తాత్కాలికంగా నిర్మించే ఎకో ఫ్రెండ్లీ రెస్టారెంట్లు, కేఫ్‌లు. ఇవి సిమెంట్, ఇటుకలతో కాకుండా కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనలకు లోబడి వెదురు, కలప, తాటి ఆకులు, కాన్వాస్ క్లాత్‌లతో డిజైన్ చేస్తారు. గోవా, కేరళ వంటి అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాల్లో ఈ షాక్స్ అత్యంత ప్రజాదరణ పొందాయి.

పర్యాటకులు ఇసుక తిన్నెలపై ఏర్పాటు చేసే సన్‌బెడ్స్, గొడుగుల కింద రిలాక్స్ అవుతూ, సముద్రపు గాలిని ఆస్వాదిస్తూ స్థానిక ఆహారాన్ని ఎంజాయ్ చేయడానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తాయి. పర్యాటక రంగంలో రెవెన్యూ జనరేట్ చేయడానికి, విదేశీ టూరిస్టులను ఆకర్షించడానికి ఇవి ఒక పవర్‌ఫుల్ టూల్‌గా ఉపయోగపడతాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రీసెంట్‌గా అధికారికంగా గెజిట్ విడుదల చేస్తూ జీవో నెంబ్ 362 ద్వారా కొన్ని రూల్స్ పెట్టింది. దీని ప్రకారం టూరిజం ప్రమోషన్ కోసం ప్రాథమికంగా మూడేళ్ల కాలానికి లైసెన్సు మంజూరు చేస్తారు. మొదటి విడతలో భాగంగా కేవలం బాపట్లలోని సూర్యలంక బీచ్, విశాఖ బీచ్‌లలో మాత్రమే వీటిని ప్రయోగాత్మకంగా అనుమతి ఇస్తారు. ప్రతి షాక్ సుమారు వెయ్యి నుంచి 1500 వందల చదరపు అడుగుల వైశ్యాల్యంలో, సరైన కిచెన్, ఫెన్సింగ్, శానిటేషన్ సౌకర్యాలతో ఉండాలి. ఈ షాక్స్‌లో కేవలం తక్కువ ఆల్కహాలిక్ బెవరేజెస్ అంటే బీర్ వైన్, రెడీ టు డ్రింక్ పానీయాలు మాత్రమే సర్వ్ చేయడానికి అనుమతి ఉంటుంది. ఎలాంటి హార్డ్ లిక్కర్ విక్రయించడానికి లేదు. మద్యపాన సేవలు ఉదయం పది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. అయితే ఆహార సేవలు రాత్రివేళల్లో కూడా కొనసాగించవచ్చు. మూడు సంవత్సరాల కోసం ప్రాథమిక అప్లికేషన్ ఫీజు రెండు లక్షల రూపాయలు, సైలెన్స్ కోసం పదివేల రూపాయలు చెల్లించాలి. మొదటి సంవత్సరానికి వార్షిక రిటైల్ ఎక్సైజ్ టాక్స్ ఏడు లక్షల 50 వేల రూపాయలు ఉంటుంది. దీన్ని ఏటా పది శాతం పెంచుతుంటారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో మండిపడుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విమర్శల దాడి చేశారు. టూరిజం నెపంతో ఆంధ్రప్రదేశ్‌ను క్రమంగా లిక్కర్ హబ్‌గా మారుస్తున్నారని, పవిత్రమైన విశాఖను మందుబాబులు అడ్డాగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సముద్ర తీరాల్లో బహిరంగంగా మద్యం విక్రయాలు జరపడం వల్ల లా అండ్ ఆర్డర్ సమస్యలు వస్తాయని, వైజాగ్ బీచ్ రోడ్డుకు వచ్చే ఫ్యామిలీస్, మహిళల భద్రత గాలిలో కలుస్తుందని ఆరోపించారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం వైజాగ్‌లో బీచ్ లవ్ ఫెస్టివల్ పెట్టాలని చూస్తే మహిళా సంఘాలు అడ్డుకున్న విషయాన్ని వైసీపీ గుర్తు చేస్తుంది. "బీచ్‌షాక్స్ పేరుతో తీరంలో మద్యం అమ్మితే కుటుంబంతో మొత్తం కలిసి బీచ్‌కు ఎలా వెళ్తారు. దీని వల్ల బహిరంగ ప్రదేశాలు విశ్రాంతి కోసం వెళ్లే ఫ్యామిలీలు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి వచ్చింది." అని జగన్ విమర్శించారు. వైజాగ్ ఒక అంతర్జాతీయ ఐటీ పర్యాటక నగరంగా ఎదుగుతోందని ఇక్కడికి వచ్చే టూరిస్టులకు కనీస వినోద సౌకర్యాలు లేకపోవడం వల్ల రాష్ట్ర రెవెన్యూ గోవా, కేరళ వంటి పొరుగు రాష్ట్రాలకు తరలిపోతుందని నేతలు అంటున్నారు. బీచ్ షాక్స్ చుట్టూ లాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు సీసీటీవీ సర్వైలెన్స్, స్పెషల్ పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు హోంమంత్రి అనిత హామీ ఇచ్చారు. పర్యావరణవేత్తల ఆందోళన పరిగణలోకి తీసుకొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించడంతోపాటు శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ పద్ధతులను అమలు చేయాలని యాజమానులకు ఆదేశాలు జారీ చేశారు. ఏడాది తర్వాత ఈ పైలట్ ప్రాజెక్టు ఫలితాలను సమీక్షించిన తర్వాతే మిగిలిన జిల్లాలకు విస్తరిస్తామని ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది.

## స్వర్ణాంధ్ర 2047 దిశగా చంద్రబాబు అడుగులు

**ముర్ము జీవితం... స్ఫూర్తిదాయకం**

ఈరోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తో కలిసి ఇక్కడ కూర్చునే భాగ్యం మనకు దక్కింది. ఆమె జీవితం కేవలం తరగతి గదిలో నేర్వలేని ఒక పాఠం. ఆమె ఒక చిన్న గిరిజన గ్రామంలో జన్మించారు. చాలా మందిలాగే కుంగదీసే వ్యక్తిగత విషాదాలను ఆమె ఎదుర్కొన్నారు. అయినా ఆమె ఎన్నడూ విశ్వాసం కోల్పోలేదు... సేవ చేయడం ఆపలేదు... ముందుకు సాగడం ఆపలేదు. ఒక ఉపాధ్యాయురాలిగా... ఒక శాసనసభ్యురాలిగా... ఒక గవర్నర్గా... ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాష్ట్రపతిగా మన ముందున్నారు. ఆమె ప్రయాణం ప్రతి యువ విద్యార్థికి ఒక సత్యాన్ని చెబుతుంది... మీ ప్రారంభం మీ గమ్యాన్ని నిర్ణయించదు. మీ ధైర్యమే నిర్ణయిస్తుంది. భారత రాష్టపతి ఒక చిన్న గిరిజన గ్రామం నుండి రాష్ట్రపతి భవన్కు ఎదగగలిగితే... మీ విద్య మీకు ఏమి సాధించడంలో సహాయపడుతుందో ఊహించండి. మేడమ్ జీవితం లక్షలాది మంది భారతీయ యువతకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని అన్నారు..

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవానికి హాజరవ్వడం నాకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ప్రతి స్నాతకోత్సవం ప్రత్యేకమైనదే... కానీ మొదటి స్నాతకోత్సవం ఎప్పటికీ చారిత్రాత్మకమైనది. ప్రతి సంవత్సరం డిగ్రీలు ప్రదానం చేస్తారు... కానీ చరిత్ర ఒక్కసారే లిఖించబడుతుంది. రాబోయే సంవత్సరాలలో ఈ విశ్వవిద్యాలయం నుండి వేలాది మంది విద్యార్థులు పట్టభద్రులవుతారు. కానీ కేవలం ఒకే ఒక్క బ్యాచ్ మాత్రమే ఎప్పటికీ గుర్తుండిపోతుంది... అదే మొదటి బ్యాచ్. ఆ గౌరవం... ఆ వారసత్వం... మీకే చెందుతుంది. ప్రతి పట్టభద్రుడికి, ప్రతి స్వర్ణ పతక విజేతకు నా హృదయపూర్వక అభినందనలు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీ కేవలం ఒక విద్యా ప్రాంగణం మాత్రమే కాదు, అదొక హామీ. నేపథ్యంతో సంబంధం లేకుండా ప్రతి యువ మేధస్సుకు కలలు కనే, నేర్చుకునే, విజయం సాధించే అవకాశం దక్కాలన్న హామీ అది. నేడు... ఇక్కడ కూర్చున్న ప్రతి పట్టభద్రుడి రూపంలో ఆ హామీ కళ్ల ముందు సాక్షాత్కరిస్తోందని అన్నారు..

## ఓఆర్ఆర్ వద్ద పోలీసుల కాల్పులు

అనంతరం అతడిని చికిత్స నిమిత్తం వనస్థలిపురంలోని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు జరిపిన ప్రాథమిక విచారణలో నిందితుడిపై నాలుగేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ఒక పోలీస్ కానిస్టేబుల్‌ను హత్య చేసిన కేసులో ఇతడు ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు సమాచారం. పదికి పైగా దొంగతనాల కేసులు ఉన్నట్లు తేలింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

**పోలీసుల పై కత్తితో దాడికి యత్నం..**
**ఆత్మరక్షణ కోసం పోలీసుల కాల్పులు**

సోమవారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో శ్రీకాంత్ AP 39 VB 6640 నంబర్ గల డీసీఎం ఐషర్ వాహనంలో ఇబ్రహీంపట్నం నుంచి బొంగులూరు వైపు ఫస్ట్ సర్వీస్ రింగ్ రోడ్ మీదుగా వెళ్తున్నాడు. వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీసీఎస్ నల్గొండ పోలీసులు అనుమానంతో వాహనాన్ని ఆపి చెక్ చేయబోతే.. నిందితుడు తన వద్ద ఉన్న కత్తితో పోలీసులపై దాడికి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపగా, రెండు బుల్లెట్లు నిందితుడి కాళ్లకు తగిలాయని పోలీసులు తెలిపారు. గాయపడిన శ్రీకాంత్‌ను వెంటనే 108 అంబులెన్స్‌లో వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అతడి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అనంతరం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి చేరుకున్న నల్గొండ సీసీఎస్ పోలీసులు నిందితుడిని నల్గొండకు తరలించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించాక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిపై గతంలో ఉన్న ఆస్తి నేరాల కేసుల వివరాలు సేకరిస్తున్నారు.

## వెదర్‌ను బట్టి ట్రాఫిక్ సిగ్నల్స్

### హైదరాబాద్‌కు సరికొత్త టెక్నాలజీ




**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్‌ను అత్యాధునిక స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో అనలాగ్ వ్యవస్థాపకుడు, సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ పి. కృష్ణారెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమై భవిష్యత్ మౌలిక సదుపాయాలు, సాంకేతిక పరిష్కారాలపై చర్చించారు.

నగరంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంయుక్తంగా చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిని సంస్థల ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నెక్స్ట్ జనరేషన్ ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిష్కారాలపై తమ ప్రణాళికలను వివరించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను కూడా సమావేశంలో ప్రదర్శించారు. నగరంలో ట్రాఫిక్ నిర్వహణ, ప్రజా సేవలు, పట్టణ పాలనను మరింత సమర్థవంతంగా మార్చేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా వినియోగించవచ్చో వివరించారు.

సెన్సర్లు, రోబోటిక్స్, ఫిజికల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫారమ్‌ల వినియోగంతో ట్రాఫిక్ రద్దీని ముందుగానే గుర్తించడం, సిగ్నళ్లను ఆటోమేటిక్‌గా నియంత్రించడం, నీటి లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టడం, విద్యుత్ వినియోగాన్ని అవసరానికి అనుగుణంగా నిర్వహించడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు వేగంగా మార్గం కల్పించడం వంటి కాగ్నిటివ్ సిటీ పరిష్కారాలను సంస్థలు వివరించాయి. వేగంగా విస్తరిస్తున్న నగరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, డేటా ఆధారిత మౌలిక సదుపాయాల ప్రణాళిక, ప్రభుత్వ సేవల సామర్థ్యాన్ని పెంచడం, పౌరులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో ఈ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని సంస్థలు పేర్కొన్నాయి.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ నగరంలోని అన్ని ట్రాఫిక్ సిగ్నళ్లను ఒకే వ్యవస్థలో అనుసంధానం చేయాలని, ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా సిగ్నళ్లు స్వయంచాలకంగా పనిచేసే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. అలాగే వాతావరణ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకుని ట్రాఫిక్ నిర్వహణను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)తో అనుసంధానం చేయాలని అధికారులను ఆదేశించారు.

సమావేశం అనంతరం ముఖ్యమంత్రి సమక్షంలో అనలాగ్, ఎంఈఐఎల్ సంస్థల మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. సాంకేతిక సహకారాన్ని బలోపేతం చేయడం, ఆవిష్కరణల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధిని వేగవంతం చేయడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా మారనుందని ప్రభుత్వం తెలిపింది.

# నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తాం

- దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్
- అభివృద్ధి పనులకు 54 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

**జయభేరి, దేవరకద్ర :**



**పదేళ్లు పాలించి, రాష్ట్రాన్ని దివాలా తీయించి.. మళ్లీ అధికారంలోకి వస్తామని బిఆర్ఎస్ నాయకులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. 20 ఏళ్లయిన బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చేది లేదు, బిఆర్ఎస్ ముగిసిన అధ్యయనం అని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.2034 వరకు రాష్ట్రంలో మేమే అధికారంలో ఉంటాం, 2034 వరకు ఇక్కడ నేనే ఎమ్మెల్యేగా ఉంటా, వచ్చే ఎన్నికల్లో పాలమూరు జిల్లాలో 14 కు 14 స్థానాలు గెలుచుకుంటామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తపరిచారు. ఇప్పటికైనా పగటి కలలు కనడం బిఆర్ఎస్ నాయకులు మానుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ హితవు పలికారు.**

దేవరకద్ర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని చిన్న చింతకుంట మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడారు. ప్రస్తుతం ప్రధానంగా హెల్త్, ఎడ్యుకేషన్, ఇరిగేషన్ ను ప్రాధాన్యత గా తీసుకొని పని చేస్తున్నామన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి బిఆర్ఎస్ ప్రభుత్వం దేవరకద్ర నియోజకవర్గంలో డిగ్రీ కాలేజ్ ను నిర్మించలేకపోయిందని ఎమ్మెల్యే ఆరోపించారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే చిన్న చింతకుంట మండల కేంద్రంలో జూనియర్ కాలేజ్, దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేశామన్నారు.నిన్ననే ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం అవుతున్న ఎర్రగట్టు ప్రాంతాన్ని పరిశీలించాను, పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి, వచ్చే అకాడమిక్ ఇయర్ నాటికి స్కూల్ నిర్మాణం పూర్తయి, పాఠశాల కార్యకలాపాలు ప్రారంభమవుతాయన్నారు.త్వరలో పల్లమర్రి, ఎర్నాల వద్ద 46 కోట్లతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏ టి సి శంకుస్థాపన చేసుకోబోతున్నామన్నారు. కౌకుంట్ల మండలం ముచ్చింతల నుండి చిన్నచింతకుంట మండలం ఎర్నాల (ఫర్దిపూర్) గేట్ వరకు బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం 40 కోట్లు, దానితో పాటు వద్దేమాన్ మెయిన్ రోడ్డు నుండి ఇంటిగ్రేటెడ్ స్కూల్ వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి 14 కోట్లు మంజూరు చేస్తూ మంగళవారం రాత్రి ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు.ప్రజలు ఎవరు కోరుకోకున్నా, ప్రజల అవసరాలను గుర్తించి బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించామన్నారు. బ్రిడ్జ్ ను మంజూరు చేయడంతో పాటు డబుల్ రోడ్డు నిర్మాణానికి జీవో జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ధన్యవాదాలు తెలిపారు. మనందరి ఇలవేల్పు శ్రీ కురుమూర్తి స్వామివారి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన ఎలివేటెడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్న యన్నారు. వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి బ్యాక్ సైడ్ రోడ్ నిర్మాణం పూర్తవుతుంది, మళ్లీ వచ్చే బ్రహ్మోత్సవాల నాటికి బ్రిడ్జి నిర్మాణం పూర్తవుతుందన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో వైద్యం పరంగా పూర్తిగా వెనుకబడిపోయింది, పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం కొత్తకోట, దేవరకద్ర లలో హాస్పిటల్స్ ను నిర్మించలేకపోయిందని ఎమ్మెల్యే విమర్శించారు. మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైద్యంపై ప్రత్యేక దృష్టికేంద్రీకరించి, దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం, పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నాం, వాటి పనులు కూడా శరవేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. చిన్న చింతకుంట, పేరూరు ప్రభుత్వ ఆసుపత్రులను కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు డెవలప్ చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు. ఈ ప్రతిపాదనల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉంది, త్వరలో చిన్నచింతకుంట, పేరూరు ఆస్పత్రులను కమ్యూనిటీ సెంట్రల్ గా డెవలప్ చేసి 30 పడకల ఆసుపత్రులు నిర్మిస్తామన్నారు. ఇరిగేషన్ పరంగా బిఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కోయిల్ సాగర్ పుడిక తీత పనులు కూడా చేయలేకపోయింది, మన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కోయిల్ సాగర్ లైనింగ్ పనులు మరియు పూడికతీత పనులకు 46 కోట్లు మంజూరు చేసింది, త్వరలో పనులు మొదలవు తాయన్నారు.10 ఏళ్ళు బిఆర్ఎస్ అధికారంలో ఉండి దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో కోర్టును ఏర్పాటు చేయలేకపోయింది, ముఖ్యమంత్రితో చర్చించి, దేవరకద్ర కు కోర్ట్ తీసుకువచ్చాము, గురువారం కోర్టు ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే అన్నారు. దేవరకద్ర మండల పరిధిలోని చౌదర్‌పల్లి, బస్వాయిపల్లి గ్రామాల వద్ద దాదాపు 416 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 500 కోట్ల రూపాయల పెట్టుబడితో ప్రతిష్టాత్మక బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ ఏర్పాటు కాబోతోందని అన్నారు. దానికి సంబంధించి ఇప్పటికే ముఖ్యమంత్రి రక్షణ శాఖ మంత్రితో చర్చించారు, దాదాపు ఈ ప్రాజెక్టుకు సంబంధించి రక్షణ శాఖ అధికారులు ప్రిలిమినారి ఎంక్వయిరీ పూర్తి చేశారన్నారు. బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ మన ప్రాంతానికి తీసుకు రావడంలో కీలక పాత్ర పోషిస్తున్న ముఖ్యమంత్రి, రక్షణ శాఖ మంత్రివర్యులకు నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో దేవరకద్ర నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడిపోయిందని ఆవేదన వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో మహిళా అభివృద్ధి సాధికారత కేంద్రం ఏర్పాటు

- ప్రారంభించిన డిసిపి శిరీష

**జయభేరి, షాద్ నగర్, జులై 01 :**

మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ గృహహింస, లైంగిక వేధింపులు, కుటుంబ కలహాలు వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఒకే చోట సమగ్ర సేవలు అందించేందుకు తెలంగాణ పోలీసుల మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భరోసా సిడిఈ డబ్ల్యు కౌన్సెలింగ్ సెంటర్ను బుధవారం షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో డీసీపీ శిరీష రాఘవేందర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.... మహిళలు మరియు ఇతర బాధితులు ఎదుర్కొంటున్న కుటుంబ, సామాజిక సమస్యలకు చట్టపరమైన సలహాలు, మానసిక పరామర్శ, కుటుంబ కౌన్సెలింగ్‌తో పాటు అవసరమైన సహాయ సేవలను ఈ కేంద్రం ద్వారా ఒకే చోట అందిస్తామని తెలిపారు. బాధితులు ఎలాంటి భయాందోళనలు లేకుండా ముందుకు వచ్చి ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.షాద్‌నగర్ జోన్ పరిధిలోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ప్రజలు ఈ కేంద్రం ద్వారా అందుబాటులో ఉండే సేవలను వినియోగించుకోవచ్చని డీసీపీ తెలిపారు. మహిళల భద్రత, కుటుంబ సమస్యల పరిష్కారంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ, సీఐ సీతారాం, పోలీసు అధికారులు, సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు



**జయభేరి, తుర్కపల్లి, జూలై 01 :**

తుర్కపల్లి మండల కేంద్రంలో బుధవారం జాతీయ వైద్యుల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కపల్లి మండల కేంద్రంలో ఆయుష్ అనుభవ వైద్యుల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కిష్టయ్య మాట్లాడుతూ గ్రామాల్లో 24 గంటలు పేద ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలని అన్నారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి శ్రీకర్ దంపతులు మండలంలోని గ్రామీణ వైద్యులను జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఘనంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్మ అనుభవ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు పెండెం రవి, ప్రధాన కార్యదర్శి దుగ్యాల రవికుమార్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పిసికే నర్సింగరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజ్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి కసిర బోయిన బాలయ్య, గ్రామీణ వైద్యులు ఆకుల దేవయ్య, ఆంజనేయులు, రవి, ఎల్లేష్, దుర్గయ్య, శివయ్య, సత్యనారాయణ, స్వామి, కృష్ణ, యూసుఫ్, శేఖర్, మహేష్, బాలచంద్రం, లక్ష్మయ్య, కృష్ణ, నరేష్, కృష్ణ, కరుణాకర్, జివిలికపల్లి మహేష్ పాల్గొన్నారు.

## అక్రమంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు



**జయభేరి, తుర్కపల్లి, జూలై 01 :**

తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన పఠాన్ హుస్సేన్ ఖాన్ అనే వ్యక్తి అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ శివారు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు పఠాన్ హుస్సేన్ ఖాన్ అదుపులోకి తీసుకొని విచారించగా అతని వద్ద నుండి సుమారు 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తక్యుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిందితుడు గతంలో కూడా గంజాయి కేసులో నిందితుగా ఉండడమే కాకుండా సుమారు 15 రోజుల క్రితం మాదాపురం గ్రామంలో ఓ స్వీట్ హౌస్ లో పనిచేసే వ్యక్తిపై దాడి చేసిన కేసులో కూడా నిందితుడిగా ఉన్నట్లు గుర్తించారు .ఈ కేసులో పరారీలో ఉన్న నిందితుడు ప్రస్తుతం పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరపరచగా న్యాయస్థానం అతనికి రిమాండ్ విధించిందని తెలిపారు. అంతేకాకుండా సదరు వ్యక్తిపై తుర్కపల్లి పోలీస్ స్టేషన్లో హిస్టరీ షీట్ కూడా ఉందని అన్నారు యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. గంజాయి విక్రయించే వారిపై తాగే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, శాంతి భద్రతలను ఉల్లంఘించి నేరాలను పునరావృతం చేసే వ్యక్తులపై చట్టపరంగా కఠినంగా వ్యవహరించి రిమాండ్ కు పంపించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.



## కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులకు అన్యాయం

- ఉద్యమకారుల భూ పోరాటంకి తరలిరండి
- తెలంగాణ రక్షణ సేన షాద్ నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గంగాపురం ఉమాదేవి ముదిరాజ్

**జయభేరి, షాద్ నగర్, జులై 01 :**

మా భూములు మాకేనని తిరగబడి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ రక్షణ సేన మహిళా అధ్యక్షురాలు గంగాపురం ఉమాదేవి ముదిరాజ్ అన్నారు. ఉప్పల్ బాగాయత్ లో జరుగుతున్న ఉద్యమకారుల భూ పోరాటంలో ప్రతి ఒక్క తెలంగాణ పోరాట యోధులు, తెలంగాణ బిడ్డలు పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన ఉద్యమకారులకు, ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు. మా భూములు మాకేమినని తిరగబడ్డ రాగమా అనే నినాదాలు ఎన్నో విప్లవాత్మకమైన నినాదాలతో పల్లె నుంచి పట్టణం వరకు పోరాటాలు చేసిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీ ప్రకారం 250 గజాల స్థలం, సంక్షేమ పథకాల హామీలు, కచ్చితంగా వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంను ఆమె డిమాండ్ చేశారు. అలుపెరుగని పోరాటాలు చేసిన ఉద్యమకారులను నేటికీ రాష్ట్ర ప్రభుత్వం అప్పుడప్పుడు వాళ్ళని శాలువాతో సత్కరించి, పూలదండలతో స్పీచ్ లతో ఆనందపరుస్తుంది తప్ప, ఇచ్చిన హామీ ప్రకారం తమ కుటుంబానికి ఎలాంటి గృహ వసతి, సంక్షేమ పథకాలలో ప్రత్యేక స్థానం అంటూ ఏమీ లేకపోవడం ఎంతో దురదృష్టకరమని, తెలంగాణ రాక కోసం! తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఒక విప్లవంగా పోరాడిన వీరులకు దీరులకు ఆఖరికి మిగిలింది గుండు సున్నా అని అన్నారు. అందరం ఏకమై తెలంగాణ పోరాట యోధులకు అండగా నిలవాలని, ఒకరి కోసం అందరూ అందరి కోసం ఒకరు ఏకమై తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ప్రతి ఒక్కరికి తెలంగాణ రక్షణ సేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

# మీ సేవలు చిరస్మరణీయం.. మీ ప్రయాణం ఆదర్శనీయం...

**జయభేరి, హైదరాబాద్ :**



పంచాయితీ సెక్రటరీగా పదవీ విరమణ పొందిన మా చిట్టా దేవి ప్రసాద్ చుంచనకోట గ్రామంలో వారి నివాసంలో ఆలేటి రమేశ్, ఉప్పల్ ఎమ్మెల్యే పీఏ కలిసి సన్మానించడం జరిగింది. మన గ్రామంలో దాదాపు 23 సంవత్సరాల పాటు కారోబారుగా అత్యంత నిబద్ధతతో, నిజాయితీతో ప్రజాసేవను అందించిన చిట్టా దేవి ప్రసాద్, అనంతరం తన ప్రతిభ, కృషికి గుర్తింపుగా పంచాయతీ సెక్రటరీగా పదోన్నతి పొంది వివిధ గ్రామ పంచాయతీలలో విశిష్ట సేవలను అందించారు. తాను విధులు నిర్వహించిన ప్రతి గ్రామంలో ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సేవాభావంతో పని చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామ పరిపాలనలో తనదైన ముద్ర వేశారు. అందువల్ల ప్రజల అభిమానాన్ని, ప్రజాప్రతినిధుల విశ్వాసాన్ని, ఉన్నతాధికారుల ప్రశంసలను సంపాదించుకున్నారు. సాదాసీదా వ్యక్తిత్వం, క్రమశిక్షణ, అంకితభావం, విధి నిర్వహణలో నిబద్ధత, అందరితో ఆప్యాయంగా మెలగడం వంటి సుగుణాలతో ఉద్యోగ జీవితమంతా ఆదర్శవంతమైన అధికారిగా నిలిచారు. సహోద్యోగులకు మార్గదర్శిగా, యువ ఉద్యోగులకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన మీ సేవలు చిరస్మరణీయమైనవి. ఈ రోజు ప్రభుత్వ సేవ నుండి గౌరవప్రదంగా పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా, మీ సుదీర్ఘ సేవలను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాము. మీరు అందించిన సేవలు ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయి. భగవంతుని ఆశీస్సులతో మీరు, మీ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, ఆనందం, సుఖశాంతులతో దీర్ఘాయుష్షుతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, మీ పదవీ విరమణ జీవితంలో ప్రతి రోజు కొత్త ఉత్సాహంతో, సంతోషాలతో నిండిపోవాలని ఆకాంక్షిస్తున్నాము. చిట్టా దేవి ప్రసాద్ కి పదవీ విరమణ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ సేవలు చిరస్మరణీయం.. మీ ప్రయాణం ఆదర్శనీయం... మీ భవిష్యత్తు ఆనందమయం కావాలని కోరుకుంటున్నాము.

# ఏబీవీపీ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

- ఫీజు రీయింబర్స్‌మెంట్.. స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి
- అడ్మిషన్ సమయంలో పూర్తి ఫీజు వసూలు చేయడం అన్యాయం
- ABVP తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్
- అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ABVP

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయం ముందు శాంతియుతంగా ధర్నా కార్యక్రమం చేస్తున్న సమయంలో విద్యార్థుల పైన లాఠీచార్జి చేయడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిగ్గుచేటు అంటూ నేడు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని, అడ్మిషన్ సమయంలో పూర్తి ఫీజు వసూలు చేయడం అన్యాయమని డిమాండ్ చేస్తూ దేవరకొండ బస్టాండ్ ఎదుట జాతీయ రహదారిపై విద్యార్థులతో ధర్నాకార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కోకన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ, ఈరోజు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అడుగడుగునా విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్న సమయంలో విద్యార్థుల సమస్యలనుపై ప్రశ్నించే విద్యార్థుల గొంతు నొక్కుతూ ఈ యొక్క కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పాలిట శాపంగా మారింది రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేసి పేద, మధ్యతరగతి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్ సమయంలో పూర్తి ఫీజు చెల్లించాలని కళాశాలలు ఒత్తిడి చేయడం వల్ల అనేక మంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా పూర్తి ఫీజు వసూలు చేస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి పగిళ్ల విక్రమ్, జాయింట్ సెక్రెటరీ యలమల హేమ సుందర్, వినయ్, నగర కార్యవర్గ సభ్యులు బిట్టు, సాయి, శివ, చరణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర మహాసభ మహిళా విభాగము నియామకం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పట్టణ ఆర్యవైశ్య సోదరీమణులు తెలంగాణ రాష్ట్ర మహాసభ మహిళా విభాగంలో పదవులు పొందినారు. పదవులు పొందిన వారిలో గోవిందు శైలజ, సెక్రటరీ, కర్నాటి జ్యోతి, కార్యవర్గ సభ్యులు, కర్నాటి శాంతకుమారి, కార్యవర్గ సభ్యులుగా తెలంగాణ రాష్ట్ర మహాసభ మహిళ విభాగములో నియమితులై ప్రమాణ స్వీకారం చేసిన శుభ సందర్భంగా దేవరకొండ పట్టణ ఆర్యవైశ్య సంఘం తరపున శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేసినారు. ఇలాగే అన్ని సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని మనస్ఫూర్తిగా కోరినారు.

## పెన్షనర్స్ సేవాసదనంలో ఘనంగా ఉద్యోగ విరమణ సన్మానం, పుట్టినరోజు వేడుకలు



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ పెన్షనర్స్ సేవాసదనంలో బుధవారం నాడు ఎంతో ఉత్సాహంగా ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం మరియు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. సేవాసదనం సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, క్రాఫ్ట్ టీచర్‌గా పదవీ విరమణ పొందిన ఎం. నారాయణ సింగ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా, కార్యవర్గ సభ్యులు కోర్వి లక్ష్మయ్య 73వ పుట్టినరోజు సందర్భంగా ఆయనను శాలువా మరియు కిరీటంతో సత్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య సేవాసదనం నిర్మాణ నిధికి రూ. 5,000 / విరాళంగా అందజేశారు. ఇప్పటికే ఆయన గతంలో రూ. 15,000/ విరాళంగా అందించారని ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగునూరు లింగయ్య ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్ సారథ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, ఇతర కార్యవర్గ సభ్యులు మరియు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## మూల ముఖేష్ గౌడ్ జయంతి వేడుకల్లో చందు గౌడ్



జయభేరి, దేవరకద్ర :

హైదరాబాద్ లో బుధవారం మాజీ మంత్రి గోషామహల్ ఎమ్మెల్యే కీర్తిశేషులు మూల ముఖేష్ గౌడ్ 67వ జయంతి వేడుకల్లో మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చందు గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూల ముఖేష్ గౌడ్ కుమారుడు విక్రమ్ గౌడ్ మరియు ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అంబర్ పేట్ శ్రీనివాస్ యాదవ్లతో కలిసి మూలా ముఖేష్ గౌడ్ కు చందు గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలలో ఎమ్మెల్యే సోదరుడు




జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని దేవరకద్ర మున్సిపాలిటీలోని మీన్గవానిపల్లి పల్లిలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాలలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబం తరఫున నూతన వస్త్రాలను అందజేసి భాస్కర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి

- ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత
- దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

జయభేరి, చందంపేట :



ప్రతి ఒక్కరూ అంజనేయ స్వామి అనుగ్రహం పొందాలి అని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.బుధవారం చందంపేట మండలం ఉస్మాన్ కుంట గ్రామంలో నూతన నిర్మించిన అంజనేయ స్వామి ధ్వజ స్తంభం ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అని ఆయన అన్నారు.ఆంజనేయ స్వామి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ పాలనలో ఆలయాలకు మహర్దశ వచ్చిందని అన్నారు. సనాతన హిందూ ధర్మరక్ష పరిరక్షణ కోసం కేసీఆర్ విశేష కృషి చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం, పునర్నిర్మాణం కోసం బీఆర్ఎస్ సర్కారు నిర్విరామంగా కృషి చేసిందని అన్నారు.

రాష్ట్రంలోని 4,805 ఆలయాల ధూప, దీప, నైవేద్యాల కోసం ప్రభుత్వం ప్రతి దేవాలయానికి రూ.6వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లించి ఆదుకున్నదని అన్నారు. దీనిలో రూ.2వేలు నిత్య పూజల కోసం, రూ.4 వేలు అర్చకుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఆలయాలకు పునర్వైభవం వచ్చిందన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలు కేసీఆర్ కృషితో ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ పున:నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధుల ద్వారా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను, కామన్ గుడ్ ఫండ్ నిధులతో ఇతర ఆలయాల జీర్ణోద్ధరణ, దేవాలయాల నిర్మాణ పనులను శరవేగంగా కేసీఆర్ సర్కార్ చేపట్టిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ విశేష కృషి చేసిందన్నారు. అనంతరం మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ని గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బోయపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీపీ ముత్యాల సర్వయ్య, కేతవత్ శంకర్ నాయక్, సర్పంచ్ సత్యానారి, రామావత్ మోహన్ కృష్ణ, కేతావత్ రమేష్, లోటావత్ బీమా నాయక్, దాసు భావోజీ, ఉప సర్పంచ్ అను అతిరాం, ఫకీరా నాయక్, కేతావత్ హేము నాయక్, మంగ్యనాయక్, చందర్, లక్క, జబ్బర్, బిచ్చు, మంగతా, భాషా, జైల్ సింగ్, అరుణ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## బాగా చదువుకొని పేరు ప్రతిష్టలు తీసుకురావాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్
- పామాపురం, మిరాస్ పల్లి పాఠశాలల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

జయభేరి, దేవరకద్ర :





విద్యార్థులు బాగా చదువుకొని తమ తల్లిదండ్రులకు, తాము పుట్టిన గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సూచించారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మండలం మీరాస్ పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పామాపురం ప్రభుత్వ పాఠశాలకు వివిధ గ్రామాల నుండి కాలినడకన వచ్చే విద్యార్థులకు మరియు మీరాస్ పల్లి ప్రభుత్వ పాఠశాలకు వివిధ గ్రామాల నుండి కాలినడకన వచ్చే విద్యార్థులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సైకిళ్ళను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రసంగించారు. విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్య తీస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు అందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలో పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు సమకూరుస్తున్నామన్నారు. విద్యానే తలరాతను మారుస్తుందన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని తమ తల్లిదండ్రులతోపాటు తమ గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకోరావాలని ఎమ్మెల్యే సూచించారు.అనంతరం పాలెం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు వివిధ గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ సైకిళ్ళను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం వేడుకలు

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ కమిటీ హాల్ లో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. అధ్యక్షుడు NVT, SI నారాయణరెడ్డి సభ్యులతో కలిసి డాక్టర్స్ అందరిని శాలువాలతో సత్కరించి పూల మొక్కలు అందజేసినారు. వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే భగవంతుని రూపంలో డాక్టర్స్ పునర్ జన్మని ఇస్తారు అని ప్రాణాలను కాపాడటమే కాకుండా ప్రజల్లో ఆరోగ్య స్పృహను పెంపొందించడంలో వైద్యుల పాత్ర అసమానమైనది.

వైద్యులు సాధారణ ప్రజల్లో ఉండే అనారోగ్యాలు, మధుమేహం మరియు ఒత్తిడి వంటి సమస్యలపై అపోహలను తొలగించి, ప్రామాణిక వైద్య సలహాలను పాటించాలని సూచిస్తారు .ఈ దినోత్సవం సందర్భంగా మీ పరిసరాల్లోని లేదా మీకు సేవలు అందించిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలియజేయాలని అన్నారు. సూపర్డెంట్ డాక్టర్ రవి ప్రకాష్ మాట్లాడుతూ దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. డాక్టర్స్ చేస్తున్న సేవలను గుర్తించి ప్రతి సంవత్సరం డాక్టర్స్ డే నాడు వారిని సత్కరించడం అభినందనీయమని అని ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్ కోశాధికారి కృష్ణకిషోర్ ATO ప్రసన్న భాస్కర్ రెడ్డి కౌన్సిలర్ ముత్యాల రవి వంగూరు వెంకటేశ్వర్లు ,సన్నీ, తాళ్ల సురేష్ ,AISF వల్ల మల్ల ఆంజనేయులు, కౌన్సిలర్ సాయి చంద్ర గౌడ్ ,కౌన్సిలర్ పొట్ట మధు, కరాటే మాస్టర్ గోపి ,108 రాంబాబు కానిస్టేబుల్ అనుష ఐజాక్ నాగరాజు, నరేష్, రాము, విజయ్ ,జమీర్ ,క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ డాక్టర్స్ డే

- డా. సిరంగి సంతోష్ కుమార్ ను సన్మానించి శుభాకాంక్షలు తెల్పిన బిజేపి నాయకులు

జయభేరి, పరకాల, జులై 01:




జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా పరకాల ప్రముఖ వైద్యులు, బీజేపీ రాష్ట్ర నాయకులు డా. సిరంగి సంతోష్ కుమార్ ని బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షులు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వైద్య వృత్తిని కేవలం ఉపాధిగా కాకుండా సేవా ధర్మంగా భావిస్తూ ప్రజలకు నిస్వార్థ వైద్య సేవలు అందిస్తున్న డా. సిరంగి సంతోష్‌కుమార్ సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు.

అనారోగ్యంతో బాధపడుతున్న ఎందరో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, పలు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ సామాన్య ప్రజలకు ఆరోగ్య సేవలను చేరువ చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న డా. సంతోష్ కుమార్ సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.

భవిష్యత్తు లోనూ ఇదే సేవా స్ఫూర్తితో ప్రజలకు మరిన్ని ఆరోగ్య సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ డా. సిరంగి సంతోష్‌కుమార్ కి జాతీయ డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. జయంతి లాల్, బీజేపీ పరకాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుక్కల విజయ్ కుమార్, కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్, బాసాని సోమరాజు, మెంతుల సురేష్, సూధమల్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- నేడు ఉప్పల్ బాగాయత్‌లో భూ పంపిణీ కార్యక్రమంకు తెలంగాణ బిడ్డలు తరలిరండి
- తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు "ఎండి ముస్తఫా"

జయభేరి, షాద్ నగర్, జులై 01 :

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన డిమాండ్ చేస్తోంది. తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో నేడు జూలై 2న ఉప్పల్ బాగాయత్‌లో భూ పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి. ముస్తఫా తెలిపారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు ప్రకటించిన 250 గజాల ఇంటి స్థలం, గృహ నిర్మాణ సదుపాయం, ప్రత్యేక సంక్షేమ పథకాలు వంటి హామీలు నేటికీ పూర్తిస్థాయిలో అమలు కాకపోవడం విచారకరమని ఆయన అన్నారు. ఉద్యమకారుల త్యాగాలను గౌరవిస్తూ ప్రభుత్వం తక్షణమే ఇచ్చిన హామీలను అమలు చేసి, వారి జీవితాలకు భరోసా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. జూలై 2న ఉప్పల్ బాగాయత్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉద్యమకారులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, తెలంగాణ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి ముస్తఫా పిలుపునిచ్చారు.

## జాతీయ డాక్టర్స్ దినోత్సవం



జయభేరి, కొండమల్లేపల్లి :

జాతీయ డాక్టర్స్ డే దినోత్సవం సందర్భంగా కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో జయరాం హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ భరత్ ని, లక్ష్మీ క్లినిక్ నిర్వాహకులు డాక్టర్ వేదం ఆంజనేయ శాస్త్రి తో పాటు మరికొందరి వైద్యులను ఘనంగా సన్మానించి వారి సేవలను గుర్తు చేశారు. వేదం ఆంజనేయ శాస్త్రి కొండమల్లేపల్లి పట్టణంలో గత 50 సంవత్సరాలుగా తక్కువ ఫీజుతో వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు ప్రస్తుతం ఆయన పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, ఏరుకొండ రాము, నీలం శ్రీనివాస్ యాదవ్ మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఊట్కూరి వేమన్ రెడ్డి, కూన భానుచందర్, బొడ్డుపల్లి మల్లికార్జున్, పి సైదులు, దండు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలపై మాదకద్రవ్యాల దుర్వినియోగం.. సైబర్ నేరాలు అవగాహన కార్యక్రమం

**జయభేరి, మేడిపల్లి :**

**మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఒమేగా డిగ్రీ కళాశాలలో మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం.**



మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒమేగా డిగ్రీ కళాశాలలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO) జలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినుల కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా SHO జలేందర్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలపై జరిగే వేధింపులు, ఈవ్ టీజింగ్, స్టాకింగ్, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలు వంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి ఇబ్బంది ఎదురైనా వెంటనే పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో 100 కు కాల్ చేయాలని వివరించారు. మాదకద్రవ్యాల దుష్పరిణామాల గురించి వివరిస్తూ, డ్రగ్స్ యువత భవిష్యత్తును నాశనం చేస్తాయని, విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉండి మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. "Youth for the Nation, Not for Intoxication" అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తూ, గుర్తు తెలియని ఫోన్ కాల్స్, ఫేక్ లింకులు, OTPలు, బ్యాంకు వివరాలు, సోషల్ మీడియా మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, అలాగే National Cyber Crime Portal ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. రోడ్డు భద్రతపై మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, అధిక వేగం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి ప్రమాదకర అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణ, ఎస్ఐ రవి, ఒమేగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థినులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకోగా, పోలీసు అధికారులు వారికి అవసరమైన సూచనలు అందించారు.






## హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ రైతుల పంటలను జేసీబీలు, బుల్డోజర్లతో ధ్వంసం చేసిన అధికారులు

- రైతులకు తీవ్ర అన్యాయం

**జయభేరి, హైదరాబాద్, జూలై 1:**

ప్రభుత్వ అధికారులు భారీ పోలీసు బందోబస్తుతో వివాదాస్పద వ్యవసాయ భూముల్లోకి ప్రవేశించి, జేసీబీలు, బుల్డోజర్ల సహాయంతో రైతులు ఎంతో శ్రమించి సాగు చేసిన కూరగాయల పంటలను పూర్తిగా తొలగించారు. పంట కోతకు సిద్ధంగా ఉన్న కూరగాయలను నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేయడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనాధారమైన పంటలను ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా నాశనం చేయడం అత్యంత అమానుషమైన చర్య అని రైతులు ఆరోపించారు. న్యాయస్థానాల్లో వివాదం పెండింగ్‌లో ఉండి, హైకోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ అధికారులు ఇటువంటి చర్యలకు పాల్పడటం చట్టవిరుద్ధమే కాకుండా, రైతుల హక్కులను కాలరాసే చర్యగా వారు అభివర్ణించారు. మేడిపల్లి పరిధిలోని భూవివాదానికి సంబంధించి తెలంగాణ హైకోర్టు జారీ చేసిన స్పష్టమైన ఆదేశాలను అధికారులు అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని బాధితుడు ఆరోపించారు. ఈ భూమికి సంబంధించిన WP No.14670/2021, WP No.24626/2021 వ్యాజ్యాల్లో హైకోర్టు స్పష్టమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, సంబంధిత అధికారులు వాటిని అమలు చేయకుండా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కోర్టు ధిక్కరణకు సంబంధించి CC No.1039/2025, CC No.1130/2025 కేసులు కూడా హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులు అమలులో ఉండగా, సంబంధిత అధికారులు స్థల పరిశీలనలు చేపట్టి, అనంతరం బలవంతపు చర్యలకు దిగడం కోర్టు ఆదేశాలకు విరుద్ధమని ఆరోపించారు. ఈ చర్యలు న్యాయవ్యవస్థ పట్ల అవమానకరంగా ఉండటమే కాకుండా, అధికారుల బాధ్యతారాహిత్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయని అన్నారు.

## మాజీ సీఎం వై.ఎస్. జగన్‌ను కలిసిన పరవాడ పి.ఎస్ రాజు



**జయభేరి, పరవాడ:**

విజయవాడ తాడేపల్లి వై.సి.పి పార్టీ కేంద్ర కార్యాలయంలో పరవాడ జడ్పీటీసీ సభ్యులు, అనకాపల్లి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పి.ఎస్. రాజు మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పెందుర్తి నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులు, ప్రజా సమస్యలు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. పార్టీ శ్రేణులు ప్రజల్లో మరింత చురుకుగా పనిచేస్తూ పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని వై.ఎస్. జగన్ సూచించినట్లు పి.ఎస్. రాజు తెలిపారు.రానున్న రోజుల్లో పెందుర్తి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి సమష్టిగా కృషి చేస్తామని పి.ఎస్. రాజు పేర్కొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని విచ్ఛిన్నం చేయొద్దు

- కొత్త చట్టం రద్దుచేసి, పాత చట్టాన్ని కొనసాగించాలి
- ఉపాధి హామీ కార్మిక సంఘం సిఐటియు గౌరవ అధ్యక్షుడు గని శెట్టి డిమాండ్




**జయభేరి, పరవాడ:**

పేదల ఉపాధి హామీకి ముప్పుగా మారిన కొత్త చట్టం వి బి గ్రామ్ జి జూలై 1 నుండి అమలు చేయొద్దని, పాత చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పరవాడ మండలంలో రావాడ గ్రామంలో పని ప్రదేశంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధి హామీ కార్మిక సంఘం సిఐటియు మండల గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి, దాని స్థానంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన వి బి గ్రామ్ జి లోని నిబంధనలు ఉన్న ఉపాధిని దూరం చేసేలా ఉందని గని శెట్టి విమర్శించారు.కొత్త చట్టం అమలకి 55 క్లాజులు, వందల సబ్ పాయింట్లు విడుదల చేస్తున్న డ్రాఫ్ట్ రూల్స్ అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఈ రూల్స్ అమలు చేస్తే పని హామీ ఉండదని అధికారాలు లేకుండా రాష్ట్రాలు చివరికి ఉత్సవ విగ్రహాల వలె మిగిలిపోతాయని గని శెట్టి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కేంద్ర ప్రభుత్వం వద్ద భిక్షాటన చేయవలసిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త చట్టం కింద కేంద్రం బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి రూ 7, 707 కోట్లు, రాష్ట్రం 40% వాటా రూ 5, 138 కోట్లు కలిపి మొత్తం 12, 845 కోట్లు ఏడాది అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈ మొత్తం వేతనాలకి ఇస్తే కేవలం జాబ్ కార్డు ఉన్న కార్మికులకు ఒక్కొక్కరికి 78 పని దినాలు మాత్రమే కార్మికులకి రాష్ట్రంలో వస్తాయి అన్నారు. కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లుగా 125 పని దినాలు కల్పించాలంటే 22, 746 కోట్లు కావాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అదనంగా ఒక్క రూపాయి కూడా ఇవ్వదని అంటే రాష్ట్ర ప్రభుత్వమే తన వాటా కాకుండా రూ 9, 901 కోట్లు అదనంగా ఖర్చు చేయవలసి వస్తుందని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం ఉపాధి పై ఎంత కక్షపూరితంగా వ్యవహరిస్తుందో గత ఆరు నెలల్లో ఉపాధి అనుభవం చెప్తుంది అని అన్నారు. జులై 1 నుండి చట్టాన్ని అమలు చేస్తే ఇంకా పని దినాలు ఎలా కుదిస్తారో స్పష్టమవుతుందని అన్నారు.

## నూతన నిర్మాణాల గృహప్రవేశ మహోత్సవం

- ఇ.సి. నగర్, చర్లపల్లిలోని పంచాయతన సమేత శ్రీ విజయ గణపతి దేవాలయంలో నూతన నిర్మాణాల గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, ఉప్పల్ :**

ఇ.సి. నగర్, చర్లపల్లిలో పంచాయతన సమేత శ్రీ విజయ గణపతి దేవాలయంలో నూతనంగా నిర్మించిన వంటశాల, భోజనశాల, వసతి గృహముల గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని, ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న దేవాలయ కమిటీ సభ్యులను అభినందించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే ఉద్దేశంతో నిర్మించిన ఈ వంటశాల, భోజనశాల, వసతి గృహాలు ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీ ప్రముఖులు, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కలెక్టర్ మనూ చౌదరి ఎమ్మెల్యేకు హామీ

- మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరి ఐఏఎస్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి




**జయభేరి, ఉప్పల్ :**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనూ చౌదరిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి సంబంధించిన పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించే అంశాలపై సమగ్రంగా చర్చించారు. నియోజకవర్గ ప్రజలకు అవసరమైన సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలెక్టర్‌ను కోరారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ సహకరిస్తుందని కలెక్టర్ మనూ చౌదరి ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.



## స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 71వ అవతరణ దినోత్సవం వేడుకలు

**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుడిపల్లి శాఖ ఆవరణలో మేనేజర్ D అనిల్, SBI OBC రాష్ట్ర అధ్యక్షుడు, AO నల్గొండ SBISUSC OBC ఆర్గనైజింగ్ సెక్రటరీ NVT సిబ్బంది మరియు ఖాతాదారులతో కలసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం వారు మాట్లాడుతూ ఖాతాదారులు తమ బ్యాంకింగ్ సేవలను చక్కగా వినియోగించుకోగలరు అని విజ్ఞప్తి చేశారు. ఈ AI కాలంలో స్టేట్ బ్యాంక్ అందిస్తున్న డిజిటల్ సేవలు అన్నిటిని కూడా సక్రమంగా వినియోగించుకోగలరు అని అన్నారు.

## వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో చాటర్ అకౌంట్స్ డే



**జయభేరి, దేవరకొండ :**

వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ గ్రేటర్ దేవరకొండ ఆధ్వర్యంలో చాటర్ అకౌంట్స్ డే సందర్భంగా C A కొత్త శోభన్ బాబు కి శాలువాతో ఘనంగా సన్మానించి మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పందిరి జ్యోతి, వాసవి క్లబ్ అధ్యక్షులు ఆతుకూరి అంజనేయులు, వనిత క్లబ్ కార్యదర్శి బెజవాడ మల్లేశ్వరి, వాసవి క్లబ్ కార్యదర్శి బేలిదే రవీందర్ డిస్టిక్ జాయింట్ ట్రెజరర్ ఆలంపల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్స్ లకు సన్మానం



**జయభేరి, దేవరకొండ :**

అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం దేవరకొండ తరపున చిన్న పిల్లల డాక్టర్స్ దంపతులు డా. మక్తా నాయక్, డా. కన్యాకుమారి లను షాలువతో సన్మానించి స్వీట్ అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దలు మా దంపతులను సన్మానించడం ఆనందాన్ని కలిగించింది అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అంకం చంద్రమౌళి, కోశాధికారి పంగనూరు లింగయ్య, సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యవర్గం సభ్యులు ముషిని వీరయ్య, అలంపల్లి శ్రీనివాసులు పాలుగొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

- బొచ్చు కళ్యాణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు



**జయభేరి, పరకాల, జులై 01:**

బుధవారం ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని ప్రైమరీ పాఠశాలలను సందర్శించడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను కోరారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో ఇప్పటివరకు యూనిఫామ్స్ పాఠ్యపుస్తకాలు మొత్తం రాలేదని, అదేవిధంగా కొన్ని ప్రభుత్వ స్కూల్లో బెంచీలు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని, పాఠశాల ప్రారంభమై ఇప్పటివరకు 15 రోజులు గడుస్తున్న,మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థులసమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పరకాల పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ జిల్లా కమిటీ సభ్యుడు పవన్ కుమార్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## సీ ఎస్ సంజయ్ జాజును మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ రాహుల్ శర్మ

**జయభేరి, జయశంకర్ భూపాలపల్లి :**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజును జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నూతన సిఎస్ సంజయ్ జాజుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, పరిపాలనాంశాలపై ఇరువురు చర్చించారు.

# రామగుండంలో ఈఎస్.ఐ ఆస్పత్రి నిర్మించేది ఎప్పుడు?

- 2018 సెప్టెంబర్ లో అనుమతి ఇచ్చిన కేంద్రం
- అనువైన స్థలం చూపించని గత, నేటి ప్రభుత్వాలు
- 2025 జనవరిలో కొత్త నిబంధన ప్రకారం రాష్ట ప్రభుత్వం అనుమతినిచ్చిన కదలని జిల్లా యంత్రాంగం

**జయభేరి, గోదావరిఖని:**




పెద్దపెల్లి జిల్లా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో వంద పడకల ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) ఆస్పత్రి నిర్మాణం ముందుకు సాగడంలో అలసత్వం ఎందుకు జరుగుతుందని రామగుండం స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బుధవారం రోజున నిరసన తెలుపడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం రామగుండం స్వచ్ఛంద సంఘాల అధ్యక్షులు మద్దెల దినేష్ ఉపాధ్యక్షులు గోలివాడ చంద్రకళలు మాట్లాడుతూ.. 2018 లోనే హాస్పిటల్ నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతి లభించినప్పటికీ గత బిఆర్ఎస్ సర్కార్ అనువైన స్థలం చూపించలేదని తదనంతరం 2022లో సమాధుల పక్కన చెత్త డంపింగ్ యార్డ్ స్థలాన్ని చూపించారని ఈ స్థలానికి రోడ్డు కనెక్టివిటీ లేకపోవడం వల్ల ఈఎస్ఐ అధికారుల బృందం రిజెక్ట్ చేయడం జరిగిందనీ వారు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం 2023లో వచ్చిన ఈఎస్ఐ కొత్త నిబంధన ప్రకారం అనువైన స్థలాన్ని ఎంపిక చేయగా 2025 జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందన్నారు. ఇప్పటివరకు పెద్దపల్లి జిల్లా యంత్రాంగం దీని నిర్మాణం గురించి పట్టించుకోవడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రామగుండం ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం చేయడం వల్ల ఆసుపత్రి నిర్మాణం కాకపోవడంతో అసంఘటిత కార్మికులు వారి కుటుంబాలు తీవ్ర నిరాశలో ఉన్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఒక సంస్థలో 10 మంది అంతకంటే ఎక్కువ మంది పని చేస్తే వారికి ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ ఈ.ఎస్.ఐ వర్తింపజేస్తారని వారు పేర్కొన్నారు. కార్మికుడు పొందే వేతనం లో 0.75 శాతం కార్మికుడి నుంచి 3.25 శాతం మేనేజ్మెంట్ నుంచి కలిపి మొత్తం నాలుగు శాతం ఈ.ఎస్.ఐ కి జమ చేస్తారని, వేతనంలో ఈ.ఎస్.ఐ క్రింద డబ్బులు జమచేసి కార్మికుడికి వారి కుటుంబ సభ్యులకు ఈ.ఎస్.ఐ హాస్పిటల్ లో వైద్య సేవలు అందిస్తారు. ఈఎస్ఐ రామగుండం బ్రాంచి పరిధిలో ఐదు జిల్లాలు వస్తాయని పెద్దపల్లి, మంచిర్యాల్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు చెందిన సుమారు 60000 మందికి పైగా కార్మికులు వస్తారని వీరిలో ఈ.ఎస్.ఐ డబ్బులు చెల్లించే ఎన్టిపిసి, ఆర్.ఎఫ్.సి.ఎల్, సింగరేణి, సిమెంట్ ఫ్యాక్టరీ, ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు షాపింగ్ మాల్స్, మున్సిపల్ కార్మికులు, బీడీ కార్మికులు, వీవింగ్ మిల్లు కార్మికులకు వైద్య సేవలు అందించాలన్నారు. ఇందుకోసం రామగుండం ఎన్టీపీసీ, బసంత్ నగర్ మంచిర్యాలలో మాత్రమే ఈఎస్ఐ డిస్పెన్సరీలు కొంత నడుస్తున్నాయని, జగిత్యాల సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలకు చెందిన కార్మికులు ఎక్కడ కూడా ఈఎస్ఐ డిస్పెన్సరీలు ఏర్పాటు చేయకపోవడంతో వారు వైద్య సేవలకు నోచుకోవడం లేదన్నారు. ఒకవేళ ఈ జిల్లాలకు చెందిన వారు వైద్యం పొందాలంటే బసంత్ నగర్ లేక ఎన్టిపిసి వరకు వ్యయప్రయాసాలు కోర్చి వెళ్లక తప్పడం లేదన్నారు. పెద్ద జబ్బులు వస్తే వరంగల్, నాచారం సనత్ నగర్ లోని హాస్పిటల్, ఈఎస్ఐ హాస్పిటల్ లకు రిఫరల్ మీద వెళ్తున్నారన్నారు. గతంలోనే ఐదు ఎకరాల స్థలం ఉంటేనే ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మించవచ్చని నిబంధనలు మార్పు చేసి 2023లో కొత్త నిబంధనలు తీసుకొచ్చారని రామగుండం పట్టణంలో మూడు ఎకరాల 30 గుంటల స్థలం ఉంటె చాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2025 లో జనవరి 8న ఈ.ఎస్.ఐ ఆస్పత్రి నిర్మాణానికి అనుమతించిందని ఇప్పటికీ ఏడాది దాటిన జిల్లా అధికార యంత్రాంగం రామగుండం ఈ.ఎస్.ఐ హాస్పిటల్ నిర్మాణం విషయంలో ఎందుకు ముందుకు కదలడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 100 కోట్ల రూపాయలు 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రికి కోసం నిధులు విడుదల చేసినా జిల్లా అధికార యంత్రాంగం ఎందుకు నిర్లక్ష్యం చేస్తూ అసంఘటిత కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతుందని వారు విమర్శించారు. రామగుండంలో చుట్టు ప్రక్క ప్రాంతాల వేలాది మంది కార్మికులు ఉన్నప్పటికీ ప్రాథమిక హెల్త్ సెంటర్లు మినహా ఎలాంటి మెరుగైన వైద్య సదుపాయాలు లేక అనారోగ్య బాధపడే కార్మికులు హైదరాబాదు లాంటి దూర ప్రాంతాలకు వెళ్ళవలసి వచ్చి ఇబ్బంది పడుతున్నారని, కావున రామగుండంలో త్వరితగతిన ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని లేనియెడల రాజకీయ పార్టీలకు అతీతంగా పెద్ద ఎత్తున స్వచ్ఛంద సంఘాల ఐక్యవేదిక ఏకం చేసి పోరాడుతుందని ప్రజా ప్రతినిధులను ప్రభుత్వాన్ని అధికారులను వారు హెచ్చరించారు. ఇంకా ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపిన కాంట్రాక్ట్ కార్మిక సంఘం నేత ఏం. గౌస్, వై. లెనిన్ అలాగే స్వచ్ఛంద సంఘాల సభ్యుల కంకటి రవి, బిళ్ళ శ్రీదేవి సరిత లక్ష్మి, కొండూ రమాదేవి, కె. సుశీల, ఇమ్మడి శారద, మేకల శోభా, మండల శ్రీనివాస్, నజీర్, వికాస్ తో పాటు తదితరుల పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పైల రామచంద్రరావు

**జయభేరి, పరవాడ:**

రాష్ట్ర ప్రభుత్వ సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి పైలా రామచంద్రరావు పాల్గొని పేదల సంక్షేమ పథకం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూటమి ప్రభుత్వం ఎలా పని చేస్తుందని లబ్ధిదారులు అడిగి తెలుసుకుని ప్రతి నెల ఉదయాన్నే పెన్షన్ అందుతుందా లేదా లబ్ధిదారులతో ముచ్చటించి వారికి నాలుగు వేల రూపాయలు అందించి మీ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉండాలని పెద్దలు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బొడ్డు శ్రీను మరియు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో అంబరాన్ని అంటిన జనసేన ఇన్ ఛార్జ్ పంచకర్ల ప్రసాద్ రావ్ జన్మదిన వేడుకలు



**జయభేరి, పరవాడ:**

జనసేన పార్టీ పరవాడ మండలం ఇన్ ఛార్జ్ పంచకర్ల ప్రసాద్ రావు జన్మదిన వేడుకులు జన సేన కార్యకర్తలు,అభిమానులు మధ్య అంబారాన్ని అంటాయి.ఈ సందర్భంగా కూటమి నాయుకులు,కార్యకర్తలు వారికీ శుభాకాంక్షలు తెలియజేసి , నిండు నూరేళ్ళు పిల్లా పాపలతో అష్ట ఐశ్వర్యాలతో సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవిస్తూ ప్రజలకు మరెంతో సేవ చేస్తూ ,ప్రజల మన్ననలను పొందుతూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఉండిపోవాలని కోరుకొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు అర్జిల్లి అప్పలరాజు పాల్గోని శుభాకాంక్షలు తెలియజేసి నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలి ఆకాక్షించారు.ఈ యొక్క కార్యక్రమంలో ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీ సీనియర్ జన సైనికులు బొంది దుర్గారావు, సమ్మంగి అప్పారావు, చింతకాయల ముత్యాలు,సూరాడ మహేష్,టి శివాజీ, సూరాడ అమ్మోరయ్య,ఎస్ మున్నా, సూరాడ అమర్,ఎస్ అఖిల్,ముత్యాలు, బొంది అప్పలరాజు,బొంది ముత్యాలు ,అప్పలరాజు, అర్జిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 'బాత్రూమ్‌లో నగదు దాచేవాళ్లం'

- రామ మందిర విరాళాల కేసులో నిందితుడి వాంగ్మూలం



**జయభేరి, లక్నో జూలై 1 :**

అయోధ్య రామ మందిరంలో విరాళాల చోరీ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అరెస్టైన ఎనిమిది మంది నిందితుల్లో ఒకరైన అవినాశ్ శుక్లాను పోలీసులు విచారించారు. చోరీ చేసిన నగదును ముందుగా మరుగుదొడ్లలో దాచేవాళ్లమని, తర్వాత అవకాశం చూసుకుని బయటకు తరలించేవాళ్లమని చెప్పినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. విరాళాల లెక్కింపు ప్రక్రియలో ఆలయ ట్రస్టీ అనిల్ మిశ్రా కీలక పాత్ర పోషించేవారని కూడా అవినాశ్ చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ ఇంకా వెలువడలేదు. దర్యాప్తు ప్రకారం.. విరాళాల లెక్కింపు గది తాళాల్లో ఒకటి రామశంకర్ అలియాస్ టిన్నూ యాదవ్ వద్ద ఉండేది. మరో తాళం బ్యాంకు సిబ్బంది వద్ద ఉండేదని నిందితుడు తెలిపాడు. పలువురు కలిసి పక్కా ప్రణాళికతో చోరీకి పాల్పడేవారని, ఒకరు నగదు తీస్తుండగా మిగిలినవారు అతడికి అడ్డుగా నిలిచేవారని వెల్లడించాడు.ఆలయ ప్రాంగణంలో ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు ఉన్నాయో తమకు ముందే తెలుసని, వాటికి కనిపించకుండా కదిలేవాళ్లమని కూడా నిందితుడు చెప్పినట్లు సమాచారం. సీసీటీవీ పర్యవేక్షణ ఉన్నప్పటికీ తమ కదలికలను ఎవరూ నిశితంగా గమనించలేదని పేర్కొన్నట్లు తెలుస్తోంది. చోరీ చేసిన సొమ్ముతో భూములు, ఇల్లు కొనుగోలు చేసినట్లు కూడా నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు చెబుతున్నారు. దీంతో నిందితుల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలపై దర్యాప్తు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు.ఈ కేసులో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. అయితే అంతకుముందే జూన్ 5న అవినాశ్ శుక్లా ఇంటి నుంచి రూ.58 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు బయటపడింది. మిగిలిన మొత్తాన్ని జూన్ 5 నుంచి 8 మధ్య బ్యాంకు ఖాతాల ద్వారా తిరిగి చెల్లించినట్లు సమాచారం. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు కాకముందే నిధుల రికవరీ ప్రక్రియ ప్రారంభమైనట్లు దర్యాప్తులో తేలింది.

# యూరియా యాప్ ను వెంటనే తొలగించాలి

**జయభేరి, యాదగిరిగుట్ట:**



రైతులు యూరియా కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేసిన యాప్ తో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఆ యాప్ ను వెంటనే తొలగించాలని మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం యాదగిరి గుట్ట పీఏసీఎస్ కార్యాలయంలో పశువుల దాణా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గొంగిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. యూరియా యాప్ తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చిన్న ఫోన్లు ఉన్న రైతులు యూరియా ఎక్కడ బుక్ చేసుకోవాలనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్టీలకతీతంగా యూరియా యాప్ తొలగించేందుకు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి మాట్లాడుతూ మేము బాధ్యతలు చేపట్టిన సమయంలో సొసైటీ పూర్తి నష్టాల్లో ఉందని,అలాంటి సొసైటీ ఇప్పుడు రూ.30 కోట్ల టర్నోవర్ తో సంవత్సరానికి రూ.కోటి లాభంతో సొసైటీ నడుస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ స్కీం కింద సొసైటీని ఎఫ్ పివో అలాటైందని,అందులో భాగంగా ఫీడ్ బజార్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. రైతులందరి సహకారంతో ఫీడ్ బజార్ విజయవంతంగా నడిపిస్తామన్నారు.
యూరియా కోసం యాప్ ను ఎందుకు ఏర్పాటు చేశారో తెలియదని, యాప్ తో రైతులు కష్టాలు పడుతున్నారని, వెంటనే యాప్ ను తొలగించాలన్నారు. రుణమాఫీని మొత్తం చేయాలని,సకాలంలో రైతు బంధు వేయాలని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పాలకమండలిలో జిల్లా నుంచి ఒక్కరిని కూడా ఎన్నుకోకపోవడం శోచనీయమని, ఇక్కడి రైతులు దేవాలయం అభివృద్ధికి భూములిచ్చారని, ఇప్పటికైనా యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి ఒకరికి చోటు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ కోపరేటివ్ ఆఫీసర్ నాగార్జున, సీబీబీవో కేబీఎన్ అన్న పూర్ణ, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జి వెంకట్ రెడ్డి, జిల్లా పశు వైద్యాధికారి పి.జానయ్య, వెటర్నరీ ఏడిఎ కె.రమేష్, ఓసిపి కంపెనీ అధికారి సాయి చరణ్, ఎఫ్ పిఓ జిల్లా ఇంచార్జి పందరి జమాల్పూర్, మహేశ్వరి, డైరెక్టర్లులు, ఆయా గ్రామాల సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డులో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చోటేదీ ?

- ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించి ఆరుగురిని సభ్యులుగా నియమించండి.. మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునితా

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 01:**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఒక్కరికి కూడా అవకాశం కల్పించకపోవడం అత్యంత బాధాకరమని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా ఆవేదన వ్యక్తం చేశారు. యాదాద్రి క్షేత్రం ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిందని, అలాంటి ప్రముఖ దేవస్థానం ట్రస్ట్ బోర్డులో స్థానికులకు ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. యాదగిరిగుట్ట అభివృద్ధిలో స్థానిక ప్రజల పాత్ర ఎంతో కీలకమైందని అయినప్పటికీ తాజా నియామకాల్లో జిల్లాకు ప్రాతినిధ్యం లేకపోవడం నిరాశ కలిగించిందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి,స్థానిక యాదగిరిగుట్ట మండలం నుంచి ఒకరిని, ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి మరో ఐదుగురిని కలిపి మొత్తం ఆరుగురిని యాదగిరిగుట్ట ట్రస్ట్ బోర్డు సభ్యులుగా నియమించాలని ఆమె డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు తగిన గుర్తింపు,గౌరవం దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, స్థానిక ప్రజల మనోభావాలను గౌరవించి ట్రస్ట్ బోర్డు పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునితా కోరారు.

# దేవస్థానంలో స్థానికులకు ధర్మకర్త అర్హత లేదా..?

**జయభేరి, యాదగిరిగుట్ట, జూలై 01 :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి కూర్పులో స్థానిక భక్తులకు చోటు కల్పించకపోవడం అత్యంత బాధాకరమని బిజెపి పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్ అవేదన వ్యక్తం చేశారు. స్థానికత అంటే యాదాద్రి భువనగిరి జిల్లాతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాను పరిగణించాల్సి ఉంటుందన్నారు. సాధారణంగా ఆలయ పరిపాలన,భక్తుల వసతి సౌకర్యాలను ధర్మకర్తల మండలి చూసుకుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధర్మకర్తల మండలిలో పారిశ్రామికవేత్తలు, అత్యంత ధనవంతులు ఉన్నట్టుగా కనిపిస్తోందని. ఆధ్యాత్మిక వేత్తలు ఏరీ అని ఆయన ప్రశ్నించారు. తాము రాజకీయాలకు అతీతంగా మాట్లాడుతున్నామని అన్నారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో నిత్యం జరిగే కైంకర్యాలు, విశేష ఉత్సవాల వంటివి ఆధ్యాత్మికవేత్తలకే ఎక్కువగా తెలుస్తుందన్నారు. ధర్మకర్తల మండలి ఏర్పాటు చేసినందున.. ఇక టీటీడీ మాదిరిగా స్థానిక సలహా మండలి,ఆగమ సలహా మండలి ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం యాదగిరిగుట్ట దేవస్థానం అభివృద్ధికి తోడ్పడుతుందని రచ్చ శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. యాదగిరిగుట్ట ఆలయం తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీక. అలాంటి పవిత్ర దేవస్థానం నిర్వహణలో స్థానిక భక్తులు, ఆధ్యాత్మిక నిపుణులకు తగిన గౌరవం,ప్రాతినిధ్యం కల్పించడం అవసరం అని రచ్చ శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆసు పత్రిలో ఉచిత ఎమ్మారై సేవలు ప్రారంభం

- పేద ప్రజల ముంగిట్లోకి అత్యాధునిక వైద్య సేవలు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**జయభేరి, భూపాలపల్లి.**



పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలనే లక్ష్యంతో భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్మారై (MRI) యంత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంయుక్తంగా ప్రారంభించారు. కంప్యూటర్ స్విచ్ ఆన్ చేసి యంత్రాన్ని ప్రారంభించిన అనంతరం యంత్రం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, మారుమూల జిల్లాగా ఉన్న జయశంకర్ భూపాలపల్లిలో అత్యాధునిక ఎమ్మారై సేవలు ప్రారంభం కావడం ఎంతో సంతోషకరమన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి వరంగల్, హైదరాబాద్ వంటి నగరాల్లో లభించే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది ఆస్పత్రిలో రోగుల అవసరాల కోసం వెంటిలేటర్లు, సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఆస్పత్రిని 100 పడకల నుంచి 300 పడకలకు అప్‌గ్రేడ్ చేయడంతో పాటు రూ.14 కోట్ల వ్యయంతో నాలుగో అంతస్తు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే గుండె సంబంధిత చికిత్సల కోసం క్యాథ్ ల్యాబ్ (Cath Lab) ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తరహాలో ఇతర బ్యాంకులు కూడా తమ సిఎస్ఆర్ నిధులతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భూపాలపల్లి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. సీటీ స్కాన్, ఎమ్మారై స్కాన్ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, "డాక్టర్స్ ఫర్ యూ" సంస్థ ప్రతినిధులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంజీఎం ఆసు పత్రి తర్వాత ప్రభుత్వ రంగంలో ఎమ్మారై యంత్రం ఏర్పాటు చేసిన ఆసు పత్రిగా భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిలవడం గర్వకారణమన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఎమ్మారై సేవల నిర్వహణ కోసం ఇద్దరు నిపుణులైన ఆపరేటర్లను నియమించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదాలు లేదా అత్యవసర పరిస్థితుల్లో రోగులను హైదరాబాద్, హనుమకొండకు తరలించాల్సి వచ్చేదని, ఇకపై భూపాలపల్లి లోనే ఉచిత ఎమ్మారై పరీక్షలు అందుబాటులో ఉండడంతో ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే భూపాలపల్లి జిల్లాతో పాటు సరిహద్దు రాష్ట్రాల ప్రజలు కూడా ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. ఆస్పత్రికి ఎమ్మారై యంత్రాన్ని అందించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, హెచ్ డీ ఎఫ్ సి క్లస్టర్ హెడ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# వేరొకరి ఇయర్ బడ్స్ వాడుతున్నారా.?

**ఇది తెలిస్తే ఇంకోసారి ఆ జోలికి వెళ్లరు..**

నేటి డిజిటల్ యుగంలో స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి ఒక్కరి వద్ద బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ కచ్చితంగా ఉంటున్నాయి. ప్రయాణాల్లో ఉన్నప్పుడైనా, ఆఫీసుల్లో పనిచేస్తున్నప్పుడైనా పాటలు వినడానికి లేదా ఫోన్ మాట్లాడటానికి ఇవి ఎంతో సౌకర్యవంతంగా ఉపయోగపడతాయి. అయితే, చాలామంది తమ ఇయర్ బడ్స్ అందుబాటులో లేనప్పుడు లేదా స్నేహితులు పంపిన ఏదైనా ఆడియో వినడానికి వారి ఇయర్ బడ్స్‌ను మార్చుకుని వాడుతుంటారు. ఇలా ఇతరుల బ్లూటూత్ ఇయర్‌ఫోన్స్ లేదా ఇయర్ బడ్స్ వాడటం అనేది అత్యంత ప్రమాదకరమని, ఇది నేరుగా చెవి ఇన్ఫెక్షన్లను కొనితెచ్చుకోవడమేనని వైద్యులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు.

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఒకరి ఇయర్ బడ్స్‌ను మరొకరు పంచుకోవడం అనేది తీవ్రమైన అపరిశుభ్రమైన అలవాటు. ఇది ఎంత అసహ్యకరమైన అలవాటంటే, వేరొకరు వేసుకుని చెమట పట్టిన సాక్సులను మనం వేసుకోవడం కంటే కూడా ఘోరమైనదని వైద్యులు పోల్చి చెబుతున్నారు. సాధారణంగా ప్రతి ఒక్కరి చెవి లోపలి భాగంలో కొంత శాతం సహజమైన బ్యాక్టీరియా, వ్యాక్స్, ఫంగస్ ఉంటాయి. ఇవి ఆయా వ్యక్తుల శరీర తత్వానికి అనుగుణంగా ఉంటాయి. అయితే, మనం ఇతరుల ఇయర్ బడ్స్‌ను మన చెవిలో పెట్టుకున్నప్పుడు, వారి చెవిలో ఉండే ఆ ప్రమాదకరమైన బ్యాక్టీరియా, ఫంగస్ కణాలు ఆ ఇయర్ బడ్స్ ద్వారా నేరుగా మన చెవిలోకి ప్రవేశిస్తాయి.

ఇలా ఇతరుల బ్యాక్టీరియా మన చెవిలో చేరడం వల్ల చెవి లోపలి భాగంలో తీవ్రమైన అలర్జీలు, ఇన్ఫెక్షన్లు దారితీస్తాయి. దీనివల్ల చెవిలో భరించలేనంత తీవ్రమైన దురద, విపరీతమైన నొప్పి, చెవిలో నుంచి పసుపు రంగు ద్రవాలు కారడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. సమస్య మరింత తీవ్రమైతే అది వినికిడి లోపానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు అప్రమత్తం చేస్తున్నారు. అందుకే పర్సనల్ హైజీన్లో భాగంగా ఇయర్ బడ్స్ అనేవి కేవలం మీ వ్యక్తిగత అవసరాలకు మాత్రమే పరిమితం కావాలి. 'మీ ఇయర్ బడ్స్‌ను ఎవరికీ ఇవ్వకండి, ఇతరులవి మీరు అస్సలు వాడకండి' అని నిపుణులు సూచిస్తున్నారు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వేరొకరిది వాడాల్సి వచ్చినా లేదా మీ ఇయర్ బడ్స్‌ని ఇతరులు వాడినా.. వాటిని తిరిగి ఉపయోగించే ముందు శానిటైజర్ లిక్విడ్ లేదా ఆల్కహాల్ వైప్స్‌తో పూర్తిగా క్లీన్ చేసిన తర్వాతే వాడటం సురక్షితం.



# నిద్రలేచిన తర్వాత ఎలా గడపాలో తెలుసా?

**హైదరాబాద్‌లోని అపోలో హాస్పిటల్స్‌కు చెందిన న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కుమార్ ఏం చెబుతున్నారంటే.. ఉదయం వేళల్లో కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం ద్వారా శరీరంలోని సిర్కాడియన్ రిథమ్‌ను సమతుల్యం చేసుకోవచ్చు. దీంతో శరీరం సహజమైన శక్తిని పొందడమే కాకుండా, మెరుగైన నిద్ర కూడా లభిస్తుంది.**

**ఉదయాన్నే సూర్యరశ్మిని ఆస్వాదించండి**

నిద్రలేచిన 30 నుంచి 60 నిమిషాలలోపు కనీసం 10 నుంచి 20 నిమిషాల పాటు సహజ సూర్య కాంతిలో గడపాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది శరీరంలో కార్టిసాల్ హార్మోన్ సమతుల్యంగా విడుదల కావడానికి సహాయపడుతుంది. ఫలితంగా రోజంతా ఉత్సాహంగా, చురుకుగా ఉండగలుగుతారు.

**నిద్రలేవగానే కాఫీకి దూరంగా ఉండండి**

చాలామంది నిద్రలేవగానే టీ లేదా కాఫీ తాగే అలవాటు కలిగి ఉంటారు. అయితే శరీరం సహజంగా మేల్కొనే ప్రక్రియకు సమయం ఇవ్వడం అవసరం. అందుకే కనీసం 60 నుంచి 90 నిమిషాల తర్వాత కాఫీ లేదా టీ తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

**ముందుగా నీళ్లు తాగండి**

రాత్రంతా నిద్రపోవడం వల్ల శరీరంలో కొంత మేర నీటి లోపం ఏర్పడుతుంది. అందువల్ల ఉదయం లేవగానే సుమారు 500 మిల్లీలీటర్ల నీరు తాగడం ద్వారా శరీరానికి తేమను అందించవచ్చు. ఇది జీవక్రియలను చురుకుగా చేయడంలో కూడా సహాయపడుతుంది.

**తేలికపాటి వ్యాయామం చేయండి**

ఉదయం కొద్దిసేపు నడవడం, ఒళ్ళు విరుచుకోవడం లేదా తేలికపాటి స్ట్రెచింగ్ చేయడం ద్వారా శరీరం చురుకుదనాన్ని పొందుతుంది. ఇది మెదడుకు రోజు ప్రారంభమైందనే సంకేతాన్ని పంపి ఏకాగ్రత, శక్తిని పెంచుతుంది. నిద్రలేవగానే సోషల్ మీడియా, మెసేజ్‌లు లేదా ఈమెయిల్స్ చూడడం వల్ల ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందువల్ల ఉదయం మొదటి గంటలో మొబైల్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించడం మంచిది.

**స్నూజ్ బటన్ నొక్కకండి**

అలారం మోగిన ప్రతిసారి స్నూజ్ బటన్ నొక్కడం వల్ల మెదడు మళ్లీ నిద్రలోకి వెళ్లే ప్రయత్నం చేస్తుంది. దీంతో అలసట, నీరసం పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి అలారం మోగగానే లేవడం ఉత్తమం.

**పోషకాలు ఉన్న అల్పాహారం తీసుకోండి**

ఉదయం అల్పాహారం రోజంతా శక్తిని అందించే ముఖ్యమైన భోజనం. అధిక చక్కెర కలిగిన ఆహారాలకు బదులుగా ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి అందుతుంది.

**ఆరోగ్యకరమైన ఉదయమే ఆరోగ్యకరమైన రోజుకు పునాది**

ఉదయం వేళల్లో ఈ సాధారణ అలవాట్లను పాటించడం ద్వారా శరీర ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, మంచి నిద్ర కూడా పొందవచ్చు. చిన్న మార్పులతో పెద్ద ఆరోగ్య ప్రయోజనాలు పొందాలంటే ప్రతి రోజును ఆరోగ్యకరమైన ఉదయంతో ప్రారంభించడం అవసరం.



# ఫుల్ ప్రోటీన్ తో అందరికి నచ్చే ఎనర్జీ డ్రింక్..

**రోజూ ఉదయాన్నే తీసుకున్నారంటే తిరుగులేని ఆరోగ్యం మీ సొంతం!**

ఇటీవలి కాలంలో మఖానా ఒక సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందింది. వీటిని కేవలం విడిగా వేయించుకుని తినడమే కాకుండా, పాలల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరానికి రెట్టింపు పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. పాలల్లో నానబెట్టిన మఖానా తినడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు, వాటిని ఎలా తీసుకోవాలో ఇప్పుడు తప్పక తెలుసుకోవాలి.

నేటి కాలంలో ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి రకరకాల ఆహారాలు తింటారు. కొందరు తమ ఆహారంలో మఖానాను కూడా చేర్చుకుంటారు. ఇటీవలి కాలంలో మఖానా..తామర గింజలు లేదా ఫాక్స్ నట్స్ అనేది ఒక సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందింది. ఆరోగ్యానికి పోషకమైన మఖానా, సహజంగా శరీరాన్ని ఆరోగ్యంగా, బలంగా ఉంచడానికి సహాయపడుతుంది. అందుకే మఖానాను పోషకాల గనిగా పరిగణిస్తారు. మఖానా తినడం వల్ల బలహీనమైన ఎముకలకు శక్తి లభిస్తుంది. వీటిని కేవలం విడిగా వేయించుకుని తినడమే కాకుండా, పాలల్లో నానబెట్టి తీసుకోవడం వల్ల శరీరానికి రెట్టింపు పోషకాలు అందుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలల్లో నానబెట్టిన మఖానా తినడం వల్ల కలిగే ప్రధాన ఆరోగ్య ప్రయోజనాలు ఇవే..

**ఎముకలు, కండరాల బలం:**

మఖానా, పాలు రెండింటిలోనూ కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలను, పళ్ళను దృఢంగా ఉంచడమే కాకుండా ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత) ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అలాగే, ఇందులోని హైప్రోటీన్ కండరాల పెరుగుదలకు, కణజాలాల మరమ్మత్తుకు ఎంతగానో తోడ్పడుతుంది.

**రోగనిరోధక శక్తి పెరుగుతుంది:**

మఖానాలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి పాలలోని అవసరమైన విటమిన్లు, ఖనిజాలతో కలిసి శరీర రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. దీనివల్ల సీజనల్ వ్యాధులు, ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా శరీరం సురక్షితంగా ఉంటుంది.

**గుండె ఆరోగ్యానికి మేలు:**

మఖానాలో కొలెస్ట్రాల్, సోడియం శాతాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇది రక్తపోటును (బిపి) అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది. పాలతో కలిసి ఇది గుండె పనితీరును మెరుగుపరిచి, గుండె జబ్బుల ముప్పును తగ్గిస్తుంది.

**జీర్ణక్రియ మెరుగుపడుతుంది:**

మఖానాలో ఉండే పీచు పదార్థం (ఫైబర్) మలబద్ధకం సమస్యను నివారిస్తుంది. పాలు జీర్ణవ్యవస్థను ప్రశాంతంగా ఉంచి, ప్రేగుల కదలికలను క్రమబద్ధీకరిస్తాయి. ఇది శరీర మెటబాలిజంను కూడా పెంచుతుంది.

**బరువు తగ్గడానికి, చర్మ సౌందర్యానికి:**

ఈ ఆహారం తిన్న తర్వాత ఎక్కువ సమయం ఆకలి వేయకుండా కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. దీనివల్ల అనవసరమైన క్రేవింగ్స్ తగ్గి, బరువు సులభంగా అదుపులోకి వస్తుంది. అలాగే, మఖానాలోని యాంటీ ఏజింగ్ గుణాలు, పాలలోని హైడ్రేటింగ్ గుణాలు కలిసి ముడతలను తగ్గించి, చర్మాన్ని ప్రకాశవంతంగా, యవ్వనంగా ఉంచుతాయి.

**కిడ్నీల ఆరోగ్యానికి రక్షణ:**

మఖానా సహజ డిటాక్సిఫైయర్‌గా పనిచేసి శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతుంది. పాలు శరీరంలో ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుతూ, మూత్రపిండాలు (కిడ్నీలు) ఆరోగ్యంగా పనిచేసేలా చేస్తాయి. పోషకాల గని అయిన ఈ నానబెట్టిన మఖానాను మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా పూర్తి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు.



